జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాపాలన

NEWS IS RIGHT

Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

చదవండి... చదివించండి... చందాదారులుగా చేరండి...
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన
న్యూస్ ఈజ్ రైట్
6-2-29/3/12, 3వ అంతస్తు,
దౌలత్ ప్లాజా, లక్డీకాపూల్, హైదరాబాద్ - 004
వివరాలకు సంప్రదించండి : 8886022523

సంపుటి 12 సంచిక 105 విశాఖపట్నం | బుధవారం 30 డిసెంబర్ 2020 | 8 పేజీలు | వెల : 5.00



## రాజకీయాలు దేశాభివృద్ధికి ఆటంకంగా మారకూడదు

### ప్రధాని నరేంద్ర మోదీ

న్యూఢిల్లీ, డిసెంబర్ 29 (ప్రజాపాలన) : రాజకీయాలు దేశాభివృద్ధికి ఆటంకంగా మారకూడదని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. మౌలిక సదుపాయాల అభివృద్ధికి రాజకీయాలను దూరంగా ఉంచాలన్నారు. దేశ మౌలిక సదుపాయాలు ఓ ప్రస్థానంగా కొనసాగాలని, ఐదేళ్ళ రాజకీయాల కోసం కాకుండా అనేక తరాలకు లబ్ధి చేకూర్చేందుకు ఈ ప్రస్థానం జరగాలని అన్నారు. ఈస్టర్న్ డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ ఆపరేషన్ కంట్రోల్ సెంటర్‌ను, న్యూ భావ్‌పూర్–న్యూ ఖుర్జా సెక్షన్‌ను మంగళవారం వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా ప్రారంభించిన అనంతరం మోదీ మాట్లాడారు. దేశంలోని మౌలిక సదుపాయాల అభివృద్ధిని రాజకీయాలకు దూరంగా ఉంచాలని మోదీ పిలుపునిచ్చారు. దేశంలో మౌలిక సదుపాయాల ప్రస్థానం అనేక తరాలకు లబ్ధి చేకూర్చేందుకు మిగతా 2లో..



పార్టీపై రజనీకాంత్ సంచలన ప్రకటన..

## పార్టీ లేనట్టే..!

**చెన్నై, డిసెంబర్ 29 (ప్రజాపాలన) :** తమిళ సూపర్ స్టార్ రజనీకాంత్ తన రాజకీయ అరంగేట్రంపై సంచలన ప్రకటన చేశారు. అనారోగ్య కారణాల దృష్ట్యా పార్టీ పెట్టట్లేదని తలైవా నేడు స్పష్టం చేశారు. అయితే రాజకీయాలతో సంబంధం లేకుండా తన ప్రజాసేవ కొనసాగుతుందని వెల్లడించారు. ఈ మేరకు ట్విటర్ వేదికగా అభిమానులకు మూడు పేజీల లేఖ విడుదల చేశారు.

### ఆత్మీయుల సూచనతో..

'ప్రస్తుత కొవిడ్ పరిస్థితుల్లో పార్టీ ప్రారంభించకూడదని నిర్ణయించుకున్నా. ఆరోగ్యం ప్రాధాన్యమని ఆత్మీయులు సూచించారు. ఎంతో భారమైన హృదయంతో ఈ నిర్ణయం ప్రకటిస్తున్నా. ఇటీవల అనారోగ్య బారినపడటాన్ని దేవుడి సూచనగా భావిస్తున్నా. ఎన్నో జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ ఇటీవల 120 మంది ఉన్న మా చిత్రబృందంలో కొందరు కరోనాకు గురయ్యారు. అలాంటిది నేను ఎన్నికల బరిలోకి దిగితే లక్షల మంది జనం మధ్యలోకి వెళ్లాలి. ప్రస్తుతం నా ఆరోగ్య పరిస్థితుల దృష్ట్యా నేను సాహసం చేయలేను. ప్రజలను ఇబ్బందుల్లో పెట్టలేను. కేవలం సోషల్‌మీడియా ప్రచారంతో మిగతా 2లో..

## ఆ ఘనత సీఎం వైఎస్ జగన్‌దే..

### స్పీకర్ తమ్మినేని సీతారాం



**శ్రీకాకుళం, డిసెంబర్ 29 (ప్రజాపాలన) :** దేశ చరిత్రలోనే నెల తిరగక ముందే తుపాను నష్ట పరిహారం రైతులకు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఏపీ అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, మూడవ విడత వైఎస్సార్ రైతు భరోసా కింద 51.59 లక్షల రైతుల ఖాతాల్లోకి 1,120 కోట్లు జమ చేశారని పేర్కొన్నారు. రైతు సంక్షేమం పట్ల సీఎం వైఎస్ జగన్ ఎంత నిబద్ధత కలిగి ఉన్నారో దీనిని బట్టి అర్థం చేసుకోవచ్చన్నారు. అప్పుల బాధలు తాళ్ల లేక గతంలో రైతుల ఆత్మహత్యల ఘటనలను సీఎం జగన్ గ్రహించారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా కంటే ఒక మానవతావాదిగా తనకు ఎంతో గౌరవమని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు.

# బాబు జూమ్‌కు దగ్గరగా.. భూమికి దూరంగా..

## ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

**అమరావతి, డిసెంబర్ 29 (ప్రజాపాలన) :** వైఎస్సార్ రైతుభరోసా పీఎం కిసాన్ పథకం మూడో విడత నిధులు, రైతులకు పెట్టుబడి సాయం, నివర్ తుపాను నష్ట పరిహారం చెల్లింపు క్యార్యక్రమం సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేత చంద్రబాబుపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. నివర్ నష్టపరిహారం ఇస్తామని ఇప్పటికే పలుమార్లు చెప్పామని సీఎం గుర్తు చేశారు. అయినా కూడా చంద్రబాబు ప్రతిపక్షనేతగా బాధ్యత లేకుండా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. పుత్రుడిని, దత్తపుత్రుడిని ఒక్క రోజు ముందు చంద్రబాబు రోడ్డు మీదకు పంపారని ఎద్దేవా చేశారు. చంద్రబాబు జూమ్‌కు దగ్గరగా.. భూమికి దూరంగా ఉంటున్నారని సీఎం జగన్ సెటైర్లు వేశారు. వక్రబుద్ధితో ఆయన ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం రూ.87,612 కోట్లు రైతుల రుణాలు మాఫీ చేస్తానని చెప్పి రైతులను నిలువునా ముంచిందని అన్నారు. కేవలం రూ.12 కోట్లు కూడా ఇవ్వలేదని.. ఈ విషయాన్ని స్వయంగా ఆర్బీఐ చెప్పిందని సీఎం తెలిపారు. ధాన్యం, విత్తనం, ఇన్సూరెన్స్, విద్యుత్ బకాయిలు, సున్నా వడ్డీ రుణాలను చంద్రబాబు ఎగ్గొట్టారని విమర్శించారు. గత ప్రభుత్వం పెట్టిన బకాయిలను కూడా చెల్లించామని ఈ సందర్భంగా సీఎం జగన్ వెల్లడించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆత్మహత్య చేసుకున్న 434 కుటుంబాలకు సాయం చేశామని చెప్పారు. దాంతోపాటు గత ప్రభుత్వం మిగతా 2లో..



## ఏపీలో తొలి స్ట్రెయిన్ కేసు నమోదు



**అమరావతి, డిసెంబర్ 29 (ప్రజాపాలన) :** ఏపీలో కొత్తరకం కరోనా వైరస్ స్ట్రెయిన్ కేసు నమోదైంది. యూకే నుంచి రాజమహేంద్రవరం వచ్చిన మహిళకు స్ట్రెయిన్ సోకినట్లు పరీక్షల్లో తేలిందని రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ కమిషనర్ కాటమనేని భాస్కర్ అధికారికంగా వెల్లడించారు. సీసీఎంబీ, ఎన్ఐవీ నివేదికల ఆధారంగా స్ట్రెయిన్ నిర్ధారణ అయినట్లు ధ్రువీకరించారు. సదరు మహిళ 10 రోజుల క్రితం కుమారుడితో సహా యూకే నుంచి మిగతా 2లో..

## ఏపీలో క్షీణించిన శాంతిభద్రతలు : చంద్రబాబు



**అమరావతి, డిసెంబర్ 29 (ప్రజాపాలన) :** అనంతపురం జిల్లా తాడిపత్రిలో మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డి ఇంటిపై వైకాపా ఎమ్మెల్యే పెద్దారెడ్డి దాడి చేయడం.. రాష్ట్రంలో క్షీణించిన శాంతిభద్రతలకు ప్రత్యక్ష సాక్ష్యమని తెదేపా అధినేత చంద్రబాబు నాయుడు విమర్శించారు. రాష్ట్రంలో 'రూల్ ఆఫ్ లా' లేదనడానికి ఈ ఘటనే ఉదాహరణ అని మండిపడ్డారు. తాడిపత్రి ఘటన పై సీఎం జగన్, డీజీపీకి చంద్రబాబు లేఖ రాశారు. ప్రతిపక్ష నాయకుడి ఇంటికెళ్లి అధికార పార్టీ ఎమ్మెల్యే దౌర్జన్యానికి దిగడం రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ చూడలేదన్నారు. కరడుగట్టిన ఫ్యాక్షనిస్టులు కూడా ఇటువంటి దుర్మార్గానికి పాల్పడిన దాఖలాలు లేవని పేర్కొన్నారు. గత 19 నెలల్లో దాడులు, దౌర్జన్యాలతో రాష్ట్రంలో భయానక పరిస్థితులు నెలకొన్నాయని.. ఏ మాఫియా మూక దాడి చేస్తుందో అని ప్రజలు ప్రాణాలు అరచేత పెట్టుకుని జీవిస్తు న్నారని ధ్వజమెత్తారు. జేసీ ఇంటికి ఎవరెవరు వచ్చారు, ఏం చేశారో అన్నీ సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయన్న చంద్రబాబు.. దాడి చేసిన వాళ్లు స్వేచ్ఛగా, నిర్భీతిగా తిరగడం గర్హనీయమ న్నారు. ప్రభాకర్ రెడ్డి, మిగతా 2లో..

## రైతులతో చర్చలకు ముందు అమిత్‌షా కీలక భేటీ



**న్యూఢిల్లీ, డిసెంబర్ 29 (ప్రజాపాలన) :** నూతన వ్యవసాయ చట్టాలపై ఉద్యమిస్తున్న రైతు సంఘాల నాయకులతో బుధవారం కేంద్ర ప్రభుత్వం చర్చలు జరపనున్న నేపథ్యంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా కీలక సమావేశం నిర్వహించారు. వ్యవసాయ మంత్రి నరేంద్రసింగ్ తోమర్, వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్‌తో షా మిగతా 2లో..






## నేనే సీఎం అభ్యర్థి : కమల్ హాసన్

చెన్నై, డిసెంబర్ 29 (ప్రజాపాలన) : మూడో కూటమి ఏర్పాటైతే తానే సీఎం అభ్యర్థి అని మక్కల్ నీది మయ్యం నేత, నటుడు కమల్ హాసన్ అన్నారు. జనవరిలో పొత్తు ప్రకటన ఉంటుందన్నారు. మూడో విడత ఎన్నికల ప్రచారానికి తిరుచ్చి నుంచి ఆదివారం కమలహాసన్ శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ప్రత్యేక హెలికాప్టర్‌లో తిరుచ్చి వెళ్లిన ఆయన అక్కడ సుడిగాలి పర్యటన చేశారు. మహిళా సంఘాలు, విద్యార్థులు, పారిశ్రామిక వేత్తలు, రైతులు ఇలా అన్ని వర్గాలను కలుసుకున్నారు. సమావేశాల ద్వారా వారి అభిప్రాయాలు, సమస్యలను మిగతా 2లో..

## రాజకీయాలు దేశాభివృద్ధికి ఆటంకంగా మారకూడదు : మోదీ

(మొదటిపేజీ తరువాయి)

జరగాలని, ఐదేళ్ళ రాజకీయాల కోసం కాదని స్పష్టం చేశారు. రాజకీయ పార్టీలు పోటీ పడాలనుకుంటే, మౌలిక సదుపాయాల నాణ్యత, వేగం, విస్తృతి కోసం పోటీ పడాలని తెలిపారు. ఏ దేశ పటిష్ఠతకైనా ప్రధాన ఆధారం మౌలిక సదుపాయాలేనని పేర్కొన్నారు. న్యూ ఖుర్జా రైల్ సెక్షన్‌లో మొదటి ఫ్రైట్ ట్రైన్ పరుగులు తీయడంతో భారతీయ రైల్వేల గత కీర్తికి నేడు (మంగళవారం) 21వ శతాబ్దపు ప్రత్యేకత లభించిందన్నారు. స్వయం సమృద్ధ నవ భారతం నినాదం స్పష్టంగా వినిపిస్తోందన్నారు. భారత దేశం ప్రపంచంలో గొప్ప ఆర్థిక శక్తిగా అవతరించే మార్గంలో దూసుకెళ్తోందని, అత్యుత్తమ అనుసంధానం మన దేశానికి చాలా ముఖ్యమైనదని చెప్పారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ఆధునిక అనుసంధానానికి సంబంధించిన ప్రతి అంశంలోనూ గత ఆరు సంవత్సరాల నుంచి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. హైవేస్, రైల్వేస్, ఎయిర్‌వేస్, వాటర్‌వేస్, ఐ-వేస్ అనే ఐదు చక్రాలపై కేంద్ర ప్రభుత్వం దృష్టి పెడుతోందన్నారు. ఈ దిశలో మంగళవారం ప్రారంభమైన భారీ ఈస్టర్న్ డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ గొప్ప ముందడుగు అని వివరించారు. ఒకే ట్రాక్‌పై ప్యాసింజర్ రైళ్లు, గూడ్స్ రైళ్లు నడిచేటపుడు గూడ్స్ రైళ్లు నెమ్మదిగా నడవడం, మధ్య మధ్యలో అంతరాయాలు ఏర్పడటం వల్ల రవాణా ఖర్చు కచ్చితంగా ఎక్కువగా ఉంటుందన్నారు. దీని వల్ల మన ఉత్పత్తులు మన మార్కెట్లలోనూ, విదేశీ మార్కెట్లలోనూ పోటీని తట్టుకోలేకపోతున్నట్లు తెలిపారు. డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ ఈ పరిస్థితిని మార్చుతుందన్నారు.

**ప్రజాస్వామిక హక్కుతోపాటు బాధ్యతను గుర్తించాలి**

ప్రజలు తమ నిరసనను తెలియజేసేటపుడు ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులను ధ్వంసం చేయరాదని మోదీ పిలుపునిచ్చారు. ఉద్యమాలు, ప్రదర్శనలు, నిరసన కార్యక్రమాలు నిర్వహించేవారు దేశం పట్ల తమకుగల బాధ్యతను మర్చిపోకూడదని చెప్పారు. తమ ప్రజాస్వామిక హక్కును వెల్లడించేటపుడు పబ్లిక్ ప్రాపర్టీని ధ్వంసం చేయరాదని తెలిపారు.

# పార్టీ లేనట్టే..!

(మొదటిపేజీ తరువాయి)

ఏ పార్టీ కూడా గెలువలేదు. అయితే నిజం మాట్లాడటానికి ఎప్పుడూ వెనుకాడను. రాజకీయాలతో సంబంధం లేకుండా నా ప్రజాసేవ నిరంతరం సాగుతోంది' అని రజనీ లేఖలో పేర్కొన్నారు. తన నిర్ణయం అభిమానులను విపరీతంగా బాధపెట్టి ఉండొచ్చని, అందుకు తాను క్షమాపణలు చెబుతున్నట్లు తెలిపారు. ఇటీవల రజనీ అనారోగ్యానికి గురైన విషయం తెలిసిందే. అధిక రక్తపోటు కారణంగా హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చేరిన ఆయన.. రెండు రోజుల తర్వాత డిశ్చార్జ్ అయ్యారు. గత శనివారం చెన్నై చేరుకున్నారు. అయితే ఆరోగ్య పరిస్థితుల దృష్ట్యా ప్రస్తుతానికి కొద్ది రోజులు రాజకీయాలకు దూరంగా ఉండాలని కుమార్తెలు ఐశ్వర్య, సౌందర్య ఆయనకు విజ్ఞప్తి చేసినట్లు సమాచారం. రాజకీయాలు, పార్టీ పనులు అంటూ నిత్యం అవే ఆలోచనల్లో ఉంటుండం వల్లే మానసిక ఒత్తిడి పెరుగుతోందని, అందుకే కొద్ది రోజుల పాటు వీటన్నింటికీ దూరంగా ఉండాలని కోరినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే రజనీ పార్టీ పెట్టట్లేదంటూ నేడు సంచలన ప్రకటన చేశారు.

**అభిమానులకు మళ్లీ నిరాశే..**

ఏళ్ల తరబడి ఎదురుచూపులకు తెరదించుతూ వచ్చే ఏడాది రాజకీయాల్లోకి వస్తున్నానంటూ తలైవా డిసెంబరు మొదటివారంలో ప్రకటన చేసిన విషయం తెలిసిందే. అందుకు సంబంధించిన వివరాలను డిసెంబరు 31న వెల్లడిస్తానని చెప్పారు. 'త్వరలో అద్భుతాలు.. ఆశ్చర్యాలు జరుగుతాయి. మారుస్తాం.. అన్నింటినీ మారుస్తాం. ఇప్పుడు కాకపోతే మరెప్పటికీ జరగదు' అని రజనీ ట్విటర్‌లో పేర్కొన్నారు. ఈ ప్రకటన వెలువడిన కొన్ని రోజులకు 'మక్కల్ సేవై కట్చి' పేరుతో తలైవా ఎన్నికల సంఘంలో పార్టీని నమోదు చేసినట్లు, ఆయనకు ఆటో గుర్తు కేటాయించినట్లు కూడా వార్తలు చక్కర్లు కొట్టాయి. అంతేగాక, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలోని అన్ని స్థానాల్లో రజనీ పార్టీ పోటీకి దిగుతుందనే వార్తలు కూడా వచ్చాయి. దీంతో తమిళనాట ఆయన అభిమానులు సంబరాల్లో మునిగితేలారు. అయితే అకస్మాత్తుగా రజనీ ఇటీవల అనారోగ్యానికి గురవడంతో ఆయన రాజకీయ ఆగమనంపై మళ్లీ సందిగ్ధత ఏర్పడింది. తన తదుపరి చిత్రం 'అన్నాత్తై' షూటింగ్ నిమిత్తం కొద్ది రోజుల క్రితం రజనీ హైదరాబాద్‌కు వచ్చారు. ఈ క్రమంలో రక్తపోటు హెచ్చుతగ్గుల కారణంగా ఆసుపత్రిలో చేరిన ఆయన గతవారం డిశ్చార్జ్ అయ్యారు. ఈ నేపథ్యంలోనే పార్టీ ఆలోచనను విరమించుకుంటున్నట్లు తలైవా నేడు ప్రకటించారు. దీంతో అభిమానులకు మళ్లీ నిరాశ తప్పట్లేదు..!

## రాజా వారికి కలిసి రాని కాలం



**విజయనగరం, డిసెంబర్ 29, (ప్రజాపాలన) :** ఒకప్పుడు ఆయన చెప్పిందే శిలాశాసనంగా భావించే వారు. మారు మాట్లాడేందుకు ఎవరూ సాహసించేవారు కాదు. అలాంటిది ఇప్పుడంతా సీన్ రివర్స్. ముఖ్యంగా నలుగురు మహిళలు మాత్రం ఆయనకు చెవిలో జోరీగలా తయారయ్యారట. అశోక్ గజపతిరాజు. ఏడుసార్లు ఎమ్మెల్యేగా.. ఒకసారి ఎంపీగా ఎన్నికైన ఆయన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలో మంత్రిగాను పనిచేశారు. టీడీపీలో చంద్రబాబు తర్వాతి స్థానం ఆయనదే అన్నంత ప్రచారం ఉండేది. మొన్నటి ఎన్నికల వరకు ఈ పూసపాటి రాజావారు ఏం చెబితే జిల్లా టీడీపీలో అదే జరిగేది. కానీ ఇప్పుడు సీన్ రివర్సయింది. మాన్సాస్ ట్రస్ట్ చైర్మన్ గిరి పోయింది. సింహాచలం దేవస్థానం చైర్మన్ పోస్ట్ కూడా లేదు. ఆయన స్థానంలో ఆనందగజపతిరాజు మొదటి భార్య కుమార్తె సంచైతను నియమించింది ప్రభుత్వం. మాన్సాస్ చైర్మన్‌గా సంచైత బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి అశోక్ గజపతిరాజుకు కష్టాలు మొదలయ్యాయి. సోషల్ మీడియా వేదికగా ఆమె అశోక్‌పై ఘాటైన విమర్శలు చేస్తున్నారు. ప్రస్తుతం వీరిమధ్య వారసత్వ పోరు కోర్టు మెట్లెక్కింది. ఇదే సమయంలో ఆనందగజపతిరాజు రెండో భార్య కుమార్తె ఊర్మిళ సైతం ఎంట్రీ ఇచ్చారు. తానే అసలైన వారసురాలినని చెబుతున్న ఆమె.. ఆనందగజపతిరాజు చనిపోయాక ఆదుకోవాల్సిన బాబాయ్ పట్టించుకోలేదని అశోక్‌గజపతిరాజుపై విమర్శలు చేస్తున్నారు. పూసపాటి రాజవంశ వారసులే ఇలా అశోక్‌కు కంట్లో నలుసుగా మారినట్టు జనాలు చర్చించుకుంటు న్నారట. ఇక టీడీపీలోనే అయినా రాజావారి పరిస్థితి సాఫీగా ఉందా అంటే లేదనే చెప్పాలి. ఎన్నడూ లేనంత వర్గ పోరు భగ్గుమంది. అశోక్ నాయకత్వాన్ని సవాల్ చేస్తున్నారు పార్టీ నాయకులు. ఇటీవల పార్టీ పదవులు ప్రకటించడంతో నివురుగప్పిన నిప్పులా ఉన్న నేతల మధ్య విభేదాలు బయటపడ్డాయి. మాజీ మంత్రి పడాల అరుణ, మాజీ ఎమ్మెల్యే మీసాల గీతలు ఓపెన్‌గానే అశోక్‌గజపతిరాజు తీరుపై విమర్శలు చేస్తున్నారు. సీనియర్లను పక్కనపెట్టి అనుచరులకు పదవులు కట్టబెట్టారని మండిపడుతున్నారు. మాజీ మంత్రి పడాల అరుణ.. ఏకంగా పార్టీ మారే ఆలోచన చేస్తున్నారట. ఇది స్థానిక టీడీపీ వర్గాల్లో కలకలం రేపుతోంది. మాజీ ఎమ్మెల్యే మీసాల గీత మాత్రం కొత్తగా టీడీపీ ఆఫీసు తెరిచారు. ఇన్నాళ్లూ అశోక్ బంగ్లానే టీడీపీ ఆఫీస్‌గా ఉంటూ వస్తోంది. గీత తీసుకున్న ఈ నిర్ణయం అశోక్ గజపతిరాజుకు.. ఆయన వర్గానికి అస్సలు మింగుడుపడటం లేదట. నాలుగు దశాబ్దాలపాటు జిల్లా టీడీపీ రాజకీయాలను ఒంటి చేత్తో నడిపించిన రాజావారికి ఈ ఇద్దరు మహిళా నేతలు ఏకు మేకైనట్టు తెలుగు తమ్ముళ్లు చర్చించుకుంటున్నారట. మొత్తానికి ఇంట్లో ఇద్దరు.. పార్టీలో మరో ఇద్దరు మహిళలు విజయనగరం రాజావారికి చుక్కలు చూపిస్తున్నారని జనం చెవులు కొరుక్కుంటున్నారట.

## నేనే సీఎం అభ్యర్థి: కమల్ హాసన్

(మొదటిపేజీ తరువాయి)

తెలుసుకున్నారు. సోమవారం కమల్ మీడియా ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు.

**జనవరిలో పొత్తు ప్రకటన..**

రాష్ట్రంలో అధికార, ప్రధాన ప్రతిపక్షం తదుపరి మూడో పక్షంగా మక్కల్ నీది మయ్యం అవతరించిందని తెలిపారు. ప్రజలు తమను ప్రత్యామ్నాయంగా చూస్తున్నారని ధీమా వ్యక్తం చేశారు. జనవరిలో పొత్తు ప్రకటన అని ఓ ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. మూడో కూటమి ఏర్పాటైన పక్షంలో ఆ కూటమి సీఎం అభ్యర్థిగా తానే ఉంటానని పేర్కొన్నారు. రజనీకాంత్ ఆరోగ్యం తనకు ముఖ్యమన్నారు. మక్కల్ నీది మయ్యం పార్టీ ద్రవిడ పార్టీయే అని స్పష్టం చేశారు. తమిళం మాట్లాడే వాళ్లందరూ ద్రవిడులేనని అన్నారు. అవసరం అయితే కలైంజర్ కరుణానిధి పేరును కొన్ని చోట్ల ప్రస్తావిస్తా మన్నారు. రాష్ట్రంలో అవినీతి పెట్రేగుతోందన్నారు. దివంగత నేత ఎంజీఆర్ తరహాలో అవినీతి రాయుళ్లపై కొరడా ఝుళిపించేందుకు ఈ పాలకులు సిద్ధమా..? అని ప్రశ్నించారు. ఏపనులకు ఏ మేరకు లంచం ముట్ట చెప్పాల్సి ఉందో ఓ చిట్టాను కమల్ ప్రకటించారు. తనను రెండేళ్ల క్రితమే రోడ్డున పడేయడానికి ఈ పాలకులు ప్రయత్నించారని, వాటన్నింటిని ఎదుర్కొన్న తాను మున్ముందు ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొనేందుకు సిద్ధమేనని ధీమా వ్యక్తం చేశారు.

## వైసీపీ కార్యకర్తకు పరామర్శించిన ఎమ్మెల్యే



**పొన్నూరు, ప్రజాపాలన :** పట్టణంలో 21 వ వార్డుకు చెందిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త కరీముల్లా ను శాసన సభ్యుడు కిలారి వెంకట రోశయ్య పరామర్శించారు. ఇటీవల కరిముల్లా రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. విషయం తెలుసుకున్న శాసనసభ్యులు మంగళవారం కరిముల్లా స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యుల్ని పరామర్శించారు . మెరుగైన వైద్యం కోసం సిఫార్సు చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## రైతులతో చర్చలకు ముందు అమిత్‌షా కీలక భేటీ

(మొదటిపేజీ తరువాయి)

నేడు సమావేశమ య్యారు. వ్యవసాయ చట్టాలపై కేంద్రం ప్రతిపాదనలు, రైతుల డిమాండ్లపై స్పందించే అంశాలపై వీరు చర్చించినట్లు తెలుస్తోంది. మరోవైపు నూతన చట్టాల రద్దు డిమాండ్‌తో దిల్లీ శివారుల్లో అన్నదాతల ఆందోళన నేడు కూడా కొనసాగింది. ఎముకలు కొరికే చలిని కూడా లెక్కచేయకుండా సింఘు, టిక్రి, చిల్లా, ఘాజీపూర్ సరిహద్దుల్లో రైతులు తమ నిరసన సాగిస్తున్నారు. వ్యవసాయ చట్టాలపై నెలకొన్న ప్రతిష్టంభన తొలగించేందుకు ఈ నెల 30న చర్చలు జరపుదామని కేంద్ర ప్రభుత్వం రైతులకు లేఖ రాసింది. ఇందుకు రైతు సంఘాలు కూడా అంగీకరించాయి. అయితే మూడు చట్టాల రద్దు, కనీస మద్దతు ధర అమలుపై చర్చించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు చర్చల రోజు కూడా అన్నదాతల ఉద్యమం సాగనుంది. కొత్త చట్టాలను వ్యతిరేకిస్తూ దిల్లీ సరిహద్దుల్లో రేపు రైతులు ట్రాక్టర్ల ర్యాలీ చేపట్టనున్నారు. ఇదిలా ఉండగా.. సాగు చట్టాలపై కేంద్రం, రైతుల మధ్య చర్చలు జరగనుండటం ఇది ఆరోసారి. ఇప్పటివరకు ఐదు దఫాలుగా చర్చలు జరిగినప్పటికీ అవి ఫలించలేదు. చట్టాలను పూర్తిగా రద్దు చేయాల్సిందేనని రైతు సంఘాలు పట్టుబట్టగా.. సవరణలు తెస్తామని కేంద్రం చెబుతోంది. మరి ఈసారైనా ప్రతిష్టంభన తొలుగుతుందో లేదో చూడాలి.

## ఏపీలో క్షీణించిన శాంతిభద్రతలు

(మొదటిపేజీ తరువాయి)

ఆయన కుమారుడు అస్మిత్ రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టడం శోచనీయమన్నారు. బాధితులపైనే తప్పుడు కేసులు బనాయించడం హేయమని విమర్శించారు. వైకాపా గుండాగిరి, దుర్మార్గాలకు, దౌర్జన్యకాండకు తక్షణమే అడ్డుకట్ట వేసి రాష్ట్రంలో 'రూల్ ఆఫ్ లా' నిలబెట్టాలని చంద్రబాబు డీజీపీకి విజ్ఞప్తి చేశారు. జేసీ కుటుంబంలో ఎవరికి ఏ ఆపద వాటిల్లినా పోలీసులే బాధ్యత వహించాలన్నారు. జేసీ కుటుంబ సభ్యులకు పూర్తి స్థాయిలో భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. వైకాపా ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డితో సహా నిందితులందరిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటి నిర్మాణానికి ఇసుక కోసం ఇద్దరి మధ్య జరిగిన ఫోన్ సంభాషణకు తెదేపా మాజీ ఎమ్మెల్యేకు సంబంధం ఉంటుందా? అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే భార్యకు మామూళ్లు ఇవ్వలేక ఇసుక సరఫరా ఆపేశానని గుత్తేదారు చెప్పడానికి, తెదేపా నాయకుడికి ఏమైనా సంబంధం ఉందా అని చంద్రబాబు నిలదీశారు. గుమ్మడికాయ దొంగ ఎవరంటే భుజాలు తడుముకోవడం గురించి విన్నామని.. కానీ ఇసుక దొంగలు ఎవరంటే ఇళ్లపై దాడికి పాల్పడటం ఇప్పుడే చూస్తున్నామని ఎద్దేవా చేశారు. ఇసుక అడిగిన వారికి, సమాధానం చెప్పిన వారికి సంబంధం లేని జేసీ ప్రభాకర్ రెడ్డి ఇంటిపై ఎమ్మెల్యే పెద్దారెడ్డి గ్యాంగ్ దాడి చేయడం ఏమిటని ధ్వజమెత్తారు. పాలకుల అండ చూసుకునే రాష్ట్రంలో నేరగాళ్లు యథేచ్ఛగా రౌడీయిజం, గుండాగిరి చేస్తున్నారని మండిపడ్డారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కొనాలని హితవు పలికారు. రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని చంద్రబాబు డిమాండ్ చేశారు.

## జేసీకి మద్దతుగా తమ్ముళ్లు

**అనంతపురం, డిసెంబర్ 29, (ప్రజాపాలన) :** తాడిపత్రి ఎమ్మెల్యే పెద్దారెడ్డి, మాజీ ఎమ్మెల్యే జేసీ ఇంటికెళ్లి రచ్చ రచ్చ చేశారు. ఇది తాడిపత్రిలో తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. రెండు వర్గాల మధ్య దశాబ్దాల ఆధిపత్య పోరు ఏ స్థాయిలో ఉందో ఇటీవల జరిగిన పరిణామలు అందరికీ తెలిసేలా చేశాయి. ఆ టెన్షన్ వాతావరణం ఇంకా తొలిగిపోలేదు. సీమలో ఫ్యాక్షన్ గొడవలు ఎలా ఉంటాయో అంతా చూశారు. కానీ.. ఈ ఘటనపై వెంటనే స్పందించాల్సిన టీడీపీ నేతలు అంతా అయ్యాక తాపీగా బయటకొచ్చారు. దాడి జరిగినా ఖండించకుండా తమ నేతకు మద్దతుగా నిలవడంలో ఎందుకు వెనకాడారన్నదానిపై ఇప్పుడు జిల్లా టీడీపీ శ్రేణుల్లో హాట్ హాట్ గా చర్చ నడుస్తుంది. సోషల్ మీడియాలో వచ్చిన కొన్ని పోస్టులపై గుర్రుగా ఉన్న పెద్దారెడ్డి.. అనుచరులతో కలిసి ఏకంగా జేసీ ఇంటికెళ్లారు. అక్కడున్న కిరణ్ అనే వ్యక్తిని చితకబాదారు. ఈ దృశ్యాలన్నీ అక్కడి సీసీ కెమెరాలకు చిక్కాయి. తర్వాత రెండు వర్గాల మధ్య తీవ్రస్థాయిలో రాళ్లదాడి తాడిపత్రిలో రణరంగాన్ని తలపించింది. ఎమ్మెల్యే పెద్దారెడ్డికి, జేసీ కుటుంబానికి దశాబ్దాలుగా గొడవలు ఉన్నాయి సరే. కాకపోతే ఇద్దరూ రెండు పార్టీలకు చెందినవారు. ఇలాంటి సంఘటనలు వెలుగు చూసినప్పుడు తప్పో ఒప్పో.. తమ పార్టీకి చెందినవారికి మద్దతుగా మాట్లాడతారు నాయకులు. కానీ.. తాడిపత్రి ఘటన జరిగిన వెంటనే జేసీ ప్రభాకర్‌రెడ్డికి మద్దతుగా అనంతపురం జిల్లాకు చెందిన టీడీపీ నాయకులెవరు స్పందించలేదు. జిల్లాలో బలమైన టీడీపీ నేతలే ఉన్నారు. వారిలో చాలా మంది గతంలో మంత్రులుగా పనిచేశారు కూడా. కానీ ఒక్కరి నుంచి కూడా వెంటనే రియాక్షన్ రాలేదు. జేసీ బ్రదర్స్ 2014 నుంచి టీడీపీతోనే ఉన్నారు. మొన్నటి ఎన్నికల్లో ఓడినా ఆ పార్టీలోనే కొనసాగుతున్నారు. అయినా అనంతపురం టీడీపీ నేతలు జరిగిన దానిపై సైలెంట్‌గా ఉండటవే అందరినీ ఆశ్చర్య పరిచిందట. దాడి జరిగింది తమ మీద కాదు కదా అనుకున్నారో ఏమో ఒక్కరు కూడా నోరు విప్పలేదు. ఈ విషయం తెలిసి టీడీపీ అధినేత చంద్రబాబు సీరియస్ అయ్యారట. జూమ్ యాప్ ద్వారా అనంతపురం జిల్లా నేతలతో మాట్లాడిన చంద్రబాబు.. టీడీపీ కీలక నేత విషయంలో ఇలా జరిగితే మీరెవరూ స్పందించరా అదే మీకు జరిగితే ఎలా ఉంటుంది? ఈ పరిస్థితి రేపు ఎవరికైనా రావొచ్చు? అని గట్టిగానే క్లాస్ తీసుకున్నారట. దాంతో పుట్టల్లోంచి చీమలు బయటకొచ్చినట్టు ఒక్కో టీడీపీ నేత రోడ్డుమీదకు వచ్చి జేసీ ప్రభాకర్‌రెడ్డికి మద్దతుగా మాట్లాడటం మొదలు పెట్టారని చెవులు కొరుక్కుంటున్నారు. మాజీ మంత్రులు కాల్వ శ్రీనివాసులు, పల్లె రఘునాథరెడ్డి, జిల్లా టీడీపీ అధ్యక్షుడు పార్థసారథి, పరిటాల శ్రీరాం తదితరులు జేసీ ప్రభాకర్‌రెడ్డికి సంఘీభావం తెలిపారు. వైసీపీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి తీరును తప్పుపట్టారు. జేసీ ఫ్యామిలీ టీడీపీలోనే ఉన్నా.. పరిటాల కుటుంబంతో అస్సలు పడదు. అయినా వాటిని పక్కనపెట్టి పరిటాల శ్రీరాం కూడా మాట్లాడటం పార్టీ వర్గాలను ఆశ్చర్యపరిచిందట. అయితే.. చంద్రబాబు చెప్పేవరకు మాట్లాడకపోవడవే అందరినీ ఆశ్చర్యపరుస్తోందట. మరి.. రానున్న రోజుల్లోనూ ఏదైనా జరిగిన వెంటనే స్పందిస్తారో.. లేక చంద్రబాబు చెప్పాకే రోడ్డెక్కుతారో చూడాలి

## సోముపై కుప్పలు తెప్పలుగా ఫిర్యాదులు

**విజయవాడ, డిసెంబర్ 29, (ప్రజాపాలన) :** రాజకీయాల్లో శత్రువును ఎదుర్కొనేందుకు శత్రువులంతా ఒక్కటవుతారు. ఇప్పుడు ఏపీ బీజేపీ అధ్యక్షుడి విషయంలోనూ అదే జరుగుతుంది. సోము వీర్రాజు శత్రువులంతా ఒక్కటవుతున్నారు. ఇప్పటికే పార్టీ కేంద్ర నాయకత్వానికి ఫిర్యాదులు వెళ్లినట్లు తెలుస్తోంది. సోము వీర్రాజు వల్ల పార్టీ బలోపేతం మాట అటుంచి, మరింత బలహీన పడే అవకాశముందని సీనియర్ నేతలు సయితం పార్టీ హైకమాండ్ కు నివేదికల రూపంలో ఇచ్చినట్లు తెలుస్తోంది. సోము వీర్రాజు పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలను చేపట్టి ఏడాది కూడా గడవ లేదు. అయితే ఆయన వచ్చిన వెంటనే అనేక మందిని పార్టీ నుంచి సస్పెండ్ చేయడం చర్చనీయాంశమైంది. పార్టీ లైన్ కు విరుద్ధంగా మాట్లాడుతున్నారని పదుల సంఖ్యలో సోము వీర్రాజు సస్పెండ్ చేశారు. పూర్వపు అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ సన్నిహితులను కూడా పార్టీ నుంచి బయటకు పంపడంతో గత కొద్దిరోజులుగా సోము వీర్రాజు వ్యవహారం చర్చనీయాంశమైంది. తాజాగా జనసేనతోనూ సోము వీర్రాజు వ్యవహరించిన తీరును బీజేపీ నేతలే తప్పుపడుతున్నారు. తిరుపతి పార్లమెంటు ఉప ఎన్నికల్లో ఎవరు పోటీ చేయాలన్న దానిపై ఇంకా స్పష్టత రాలేదు. ఇటీవల జనసేన అధినేత పవన్ కల్యాణ్ పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాను కూడా కలసి వచ్చారు. ఎవరు పోటీ చేయాలన్న దానిపై సమన్వయ కమిటీని ఏర్పాటు చేసి నిర్ణయిద్దామని జేపీ నడ్డా కూడా హామీ ఇచ్చారు. అయితే ఇప్పటి వరకూ సమన్వయ కమిటీ ఏర్పాటు కాలేదు. సోము వీర్రాజు మాత్రం తిరుపతి పార్లమెంటు ఉప ఎన్నికలో బీజేపీ అభ్యర్థి బరిలో ఉంటారని ప్రకటించారు. దీంతో జనసేన అధినేత పవన్ కల్యాణ్ నొచ్చుకున్నట్లు తెలిసింది. ఎవరినీ సంప్రదించకుండానే సోము వీర్రాజు ఏకపక్షంగా ప్రకటించారని ఆయన సన్నిహితుల వద్ద వ్యాఖ్యానించినట్లు తెలుస్తోంది. అందుకే జనసేన అభ్యర్థి కోసం స్థానికంగా వెంటనే పవన్ కల్యాణ్ ఏర్పాటు చేశారు. దీనిపై బీజేపీలోని సోము వీర్రాజు వ్యతిరేక వర్గం పార్టీ హైకమాండ్ కు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. మరి సోము ఇబ్బందుల్లో పడినట్లేనన్న చర్చ బీజేపీలో జోరుగా సాగుతుంది.

## ఏపీలో తొలి స్ట్రెయిన్ కేసు నమోదు

(మొదటిపేజీ తరువాయి)

రాజమహేంద్రవరం వచ్చారు. ఆమె కుమారుడి సహా కుటుంబసభ్యులకూ కరోనా నెగెటివ్ నిర్ధారణ అయింది. రాజమహేంద్రవరం మహిళ నుంచి మరెవరికీ స్ట్రెయిన్ సోకలేదని కాటమనేని భాస్కర్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో కరోనా పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తున్నామని.. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. యూకే స్ట్రెయిన్ రాష్ట్రంలో విస్తరించిన దాఖలాలులేవని చెప్పారు. అపోహలను నమ్మవద్దని ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు. మరోవైపు దేశవ్యాప్తంగా ఇప్పటివరకు ఆరుగురికి స్ట్రెయిన్ సోకినట్లు కేంద్ర వైద్యఆరోగ్యశాఖ వెల్లడించింది.

## బాబు జూమ్‌కు దగ్గరగా.. భూమికి దూరంగా..

(మొదటిపేజీ తరువాయి)

పెట్టిన సున్నా వడ్డీ బకాయిలు రూ.904 కోట్లు తీర్చామని సీఎం తెలిపారు. గత ప్రభుత్వం పెట్టిన ధాన్యం సేకరణ బకాయిలు రూ.960 కోట్లు కూడా చెల్లించామని సీఎం తెలిపారు. కాగా, వైఎస్సార్ రైతుభరోసా పీఎం కిసాన్ పథకం మూడోవిడత నిధులు, అక్టోబరులో వచ్చిన నివర్ తుపాను వల్ల పంటలు దెబ్బతిన్న రైతులకు పెట్టుబడి రాయితీ (ఇన్‌పుట్ సబ్సిడీ) కింద ఇస్తామన్న నిధుల్ని ప్రభుత్వం మంగళవారం జమచేసింది. వైఎస్సార్ రైతుభరోసా పీఎం కిసాన్ మూడోవిడత కింద రూ.1,120 కోట్లు, నివర్ తుపాను కారణంగా దెబ్బతిన్న వ్యవసాయ, ఉద్యాన పంటల రైతులకు పెట్టుబడి రాయితీ కింద రూ.646 కోట్లను చెల్లించింది.

అవినీతి ఆరోపణలపై ధూళిపాళ్లకు సవాలు విసిరిన

# ఎమ్మెల్యే కిలారి చర్చకు సిద్ధమా..?

దమ్ము, ధైర్యం ఉంటే అవినీతిని నిరూపించి.. వారి పేర్లు బయటపెట్టాలి

అవినీతి ఆరోపణలు నిరూపించలేకపోతే ప్రకటనలు వెనక్కి తీసుకుంటావా...చెంపలు వేసుకుంటావా...

మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రపై నిప్పులు చెరిగిన ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య



**పొన్నూరు, ప్రజాపాలన :** పొన్నూరు నియోజకవర్గంలో పేదల ఇళ్ల స్థలాల పంపిణీలో అవినీతి జరిగిందని నిరాధారమైన ఆరోపణలు చేసిన మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర ఆ ఆరోపణలకు కట్టుబడి ఉంటే చర్చకు రావాలని... అవినీతికి పాల్పడ్డ వారి పేర్లను బహిర్గతం చేయాలని పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో కిలారి మాట్లాడారు. తప్పుడు ఆరోపణలు చేసిన నరేంద్ర వాటిని నిరూపించాలని లేనిపక్షంలో ఆ ప్రకటనలను వెనక్కి తీసుకుంటావా... చెంపలు చేసుకుంటావా అని ప్రశ్నించారు. మేము ప్రజా సేవకులమని, దోపిడీ దారులము కాదని గత పాలకులు అంటున్నారు, గ్రామ గ్రామాన మట్టిని, గ్రావెల్ ను దోచుకోవడాన్ని ఏమంటారు అని ప్రశ్నించారు. షాపులను పగలకొట్టటం, సిటీకేబుల్ ను లాక్కోవడం వంటివాటిని ఏమంటారో సమాధానం చెప్పాలన్నారు. వ్యాపారస్తుల దగ్గర బలవంతంగా డబ్బులు వసూలు చేశారు అంటున్నారు... మీకు దమ్ము, ధైర్యం ఉంటే ఎవరు వసూలు చేసారో వారి పేర్లు బయట పెట్టాలన్నారు. ఆ ధారాలతో నిరూపిస్తే ఎంతటి వారినైనా సరే చర్యలు తీసుకోవడానికి వెనుకాడే ప్రసక్తే లేదన్నారు. సంగం డెయిరీ ని అరాచక శక్తుల నుంచి కపడుకుంటాము అంటున్నావు... అసలు డెయిరీ ఎవరిది , డెయిరిని కబ్జా చేసి సొంత ఆస్తిలాగా మాట్లాడుతున్నావు అని మండిపడ్డారు. డివిసి హాస్పిటల్ పర్మిషన్ కోసం వైసీపీ నాయకుల కాళ్ళు పట్టుకోలేదా అని సూటిగా ప్రశ్నించారు. అనుమతులు వచ్చిన తరువాత పేషెంట్లలలో కూడా టీడీపీ వారికే లబ్ధి చేకూరేలా చేశావని ఆరోపించారు. పొన్నూరులో టాక్స్ చెల్లించాల్సి వస్తుందని ఆవేదన చెందుతున్న నరేంద్ర... నీవు, నీ తమ్ముడు సురేంద్ర బారినపడ్డ వారందరూ మేము అధికారంలోకి వచ్చాక ఊపిరి పీల్చుకుంటున్న విషయాన్ని గమనించాలని పేర్కొన్నారు. ప్రజలు అమాయకులు కాదని అంతా చూస్తూనే ఉన్నారని... నీ అరాచకాలు, అక్రమాలు, అన్యాయాలు, అవినీతి చూడలేకే తగిన బుద్ధి చెప్పారని, ఇప్పటికైనా తగిన బుద్ధి తెచ్చుకోవాలని హితవు పలికారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికి కుల, మత, పార్టీలకు అతీతంగా అందిస్తున్నారని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి వాలేంటీర్ల ద్వారా నేరుగా పథకాలు అందించడం జరుగుతోందని తెలిపారు. మేము పొన్నూరు నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, గత 25ఏళ్లుగా చేయలేని అభివృద్ధిని చేసి చూపిస్తామని, మాది పనిచేసే తత్వమని, శిలాఫలకాలకు మాత్రమే పరిమితం కామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో షేక్ కార్పొరేషన్ చైర్మన్ షేక్.యాసిన్ ,నాజర్ ,ఆకుల వెంకటేశ్వరరావు ,మార్కెట్ యార్డ్ చైర్మన్ బోనిగల వేణు ప్రసాద్ ,వైస్ చైర్మన్ భవనం శ్రీనివాస రెడ్డి ,మాజీ చైర్పర్సన్ డాక్టర్ రూత్ రాణి ,బొద్దులూరి రంగారావు పాల్గొన్నారు.

## నిరుపేదలకు స్థలంతో పాటు ఇళ్ళు నిర్మిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి



**గుడ్లవల్లేరు, ప్రజాపాలన :** రాష్ట్రంలో 31 లక్షల మంది ఇల్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలం అందించి ఇళ్లను నిర్మిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి చరిత్ర సృష్టించారని ఉప ముఖ్యమంత్రి మరియు రెవెన్యూ శాఖ మంత్రి శ్రీ ధర్మాన కృష్ణదాస్ అన్నారు. గుడ్లవల్లేరు మండలం కౌతరం గ్రామంలో పౌరసరఫరాల శాఖ మంత్రి కొడాలి నాని, జిల్లా కలెక్టర్ ఏఎండి ఇంతియాజ్, జాయింట్ కలెక్టర్ కె మాధవీలత, ఆర్డీవో శ్రీను కుమార్ లతో కలిసి కౌతారం గ్రామంలో 350 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి విద్య, వైద్య రంగాలపై దృష్టి సారించడతో పాటు అభివృద్ధి సంక్షేమ ఫలాలు పేదలకు అందిస్తున్నారన్నారు. లబ్దిదారులకు ఇచ్చిన ఇంటి స్థలంలో ఇల్లు కట్టుకునేందుకు మూడు రకాలైన ఆప్షన్లు ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అవకాశం కల్పించాలన్నారు. పార్టీలకతీతంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేసిన వాగ్దానాలు అన్నింటిని నెరవేర్చుతూ, సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలు ఇంటి వద్దకే పాలన ను అందిస్తున్నారన్నారు. నేడు రైతు భరోసా మూడో విడత అందిస్తున్నామన్నారు. కరోనా వైరస్ ను కట్టడి చేయడంలో దేశం మెచ్చుకునే విధంగా సాహసోపేతమయిన లక్ష్యాలు సాదించారన్నారు. కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ మంత్రి కొడాలి శ్రీ వెంకటేశ్వరరావు (నాని), జిల్లా కలెక్టర్ ఏ ఎం డి ఇంతియాజ్, జాయింట్ కలెక్టర్ కె మాధవీలత, ఆర్డీవో శ్రీను కుమార్, అధికారులు, ప్రజాప్రతినిధులు, లబ్దిదారులు పాల్గొన్నారు.

## ఒంగోలు నగరంలో ఘనంగా దత్త జయంతి వేడుకలు

**ఒంగోలు (ప్రజాపాలన) :** ప్రకాశం జిల్లా ఒంగోలు నగరంలో పలు సాయి బాబా మందిరాల్లో దత్త జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మార్గశిర మాసం ధనుర్మాసం, పౌర్ణమి దత్త జయంతి, పండగ పర్వదిన సందర్భంగా , సొంత పేట సాయి బాబా మందిరంలో దత్తాత్రేయ స్వామికి, ప్రత్యేక అభిషేకాలు దత్త హెూమము నిర్వహించారు. ప్రాతఃకాలమున దత్తాత్రేయ స్వామి కి, పంచామృత అభిషేకము స్వామివారికి సహస్ర నామాలతో పూజలు, దత్త హెూమము ఆలయ అర్చకులు నిర్వహించారు. దేవస్థానం నిర్వాహకులు అళహరి చంచలరావు వారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు కోవిడ్ నిబంధనలు పాటిస్తూ మాస్కులు ధరించి సామాజిక దూరాన్ని పాటిస్తూ స్వామివారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## సర్దార్ గౌతు లచ్చన్నకి పాలాభిషేకం



**బాపట్ల, ప్రజాపాలన :** బాపట్ల గౌడ్ సంగీయులు.జై గౌడ ఉద్యమం నాయకులు ఆధ్వర్యంలో సర్దార్ గౌతు లచ్చన్న కి పాలాభిషేకం చేసి ఘన నివాళులు అర్పించిన బాపట్ల నియోజకవర్గం గౌడ సంగీయులు. ఈ సందర్భంగా మాజీ రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ తాత జయ ప్రకాశ్ నారాయణ గౌడ మాట్లాడుతూ గౌతు లచ్చన్న అవమాన పరిచే విధంగా ఎవరైనా మాట్లాడ కూడదని పలాసలో గౌతు లచ్చన్న విగ్రహాన్ని తీసేస్తానని అనడం గౌతు లచ్చన్న అవమాన పరిచినట్లు అన్నారు ఇటువంటి వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలన్నారు గౌతు లచ్చన్న ఒక కులానికి కాదు కులమతాలకతీతంగా అందరితో సన్నిహితంగా ఉంటారు అన్నారు అతను త్యాగాల నీ మరవద్దు అన్నారు గౌడ నాయకులు కర్పూరపు రామారావు గౌడ మాట్లాడుతూ పార్టీలకతీతంగా రెండు రాష్ట్రాల ప్రజలు కూడా సర్దార్ గౌతు లచ్చన్న గౌరవించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు వారు నిరంతరం పేద ప్రజల కోసం గీత కార్మికుల కోసం తన జీవితాన్ని త్యాగం చేశారన్నారు అటువంటి మహానుభావుని తప్పుగా మాట్లాడటం ఎంతవరకు న్యాయం అన్నారు దయచేసి మీ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవటం చాలా గౌరవప్రదంగా ఉంటుందన్నారు అదేవిధంగా జై గౌడ ఉద్యమం రాష్ట్ర అధికార ప్రతినిధి ఉప్పాల మురళి గౌడ్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అయినటువంటి స్వతంత్ర సమరయోధులు కల్లుగీత కార్మికుల ను నిరంతరం కాపాడుకుంటూ ఎన్నో ఉద్యమాలు చేసిన సర్దార్ గౌతు లచ్చన్న గారిని రెండు రాష్ట్రాల ప్రజలు పూర్తిస్థాయిలో గౌరవించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఈ సందర్భంగా కొనియాడారు

## సొంత ఇంటి కల నెరవేరుస్తాం ఎమ్మెల్యే కిలారి



**చేబ్రోలు, ప్రజాపాలన:** నవరత్నాలు లోని భాగంగా ఇల్లు లేనివారికి ఇంటి స్థలం ఇచ్చి ఇల్లు కట్టించడమే మా ప్రభుత్వ ధ్యేయమని పొన్నూరు శాసనసభ్యులు కిలారి వెంకట రోశయ్య అన్నారు మండల పరిధిలోని శుద్ధపల్లి గ్రామంలో నిరు పేదలకు నివేశన స్థలాలు అధికారుల సమక్షంలో ఆయన పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే ఏ రాష్ట్రంలో కూడా లేని విధంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పేదలకు భారీ స్థాయిలో నివేశన స్థలాలు ఇచ్చి పేదల పక్షపాతి అని మరోసారి నిరూపించారు అని పేర్కొన్నారు ప్రజా సంకల్ప యాత్రలో ప్రజలకు ఇచ్చిన హామీలు ఏడాదిన్నర కాకముందే అధిక సంఖ్యలో పూర్తిచేశామని, ఎన్నికల మేనిఫెస్టో నవరత్నాలలో లేని పథకాలను కూడా ప్రజల సౌకర్యార్థం ప్రవేశపెట్టి రాష్ట్ర ప్రజల మన్ననలు పొందుతున్నారని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో స్థానిక వైసిపి నాయకులు, అధికారులు పాల్గొన్నారు

## 'జగన్న బడుగు వికాసం, బ్యాంకు లోనులు' అవగాహన సదస్సు



**విజయవాడ, ప్రజాపాలన :** ఈ రోజు నగరంలోని కందుకూరి కల్యాణ మండపం నందు 'జగన్న బడుగు వికాసం మరియు బ్యాంకు లోనులు' అవగాహన సదస్సు ను ఎస్సీ ఎస్టీ చాంబర్ ఆఫ్ కామర్స్ & ఇండస్ట్రీ,కృష్ణా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అన్నవరపు నాగేశ్వరరావు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ ఎస్ సి సి ఐ ద్వారా ఎస్సీ ఎస్టీ బిసి మైనారిటీలు మరియు మహిళల కోసం, వారి అభివృద్ధి కోసం తయారు చేసిన నివేదికను మన రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి దృష్టికి ఎస్.ఎస్.సి.సి.ఐ జాతీయ అధ్యక్షుడు ఏ.డేవిడ్ బెర్నాడ్ తీసుకువెళ్లడం జరిగింది అని వెను వెంటనే అధికారులతో సాధ్యాసాధ్యాలను పరిశీలించిన తర్వాత ఆ నివేదికను యధాతథంగా అమలులోనికి తీసుకోవడం జరిగినది అని అందుకు రాష్ట్ర ప్రభుత్వానికి మరియు ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి గారికి ధన్యవాదాలు తెలుపుతున్నామని అన్నారు. రాష్ట్రాధ్యక్షులు వై ప్రవీణ్ మాట్లాడుతూ ఎల్లకాలం ఒకరి మోచేతి నీరు త్రాగేటప్పుడు పరిస్థితి కాకుండా మనమే ఒక సంస్థ స్థాపించి కొంతమంది అట్టడుగు వర్గాల నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పిస్తున్నామనే సంతృప్తి పొందవచ్చని అన్నారు. జాతీయ అధ్యక్షులు ఏ. డేవిడ్ బెర్నాడ్ మాట్లాడుతూ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గా అన్నవరపు నాగేశ్వరరావు పనిచేయడం అట్టడుగు వర్గాల నిరుద్యోగ యువతకు. పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి అని అనుకొనే వారికి మంచి అవగాహన కల్పించడమే కాక వారి అభివృద్ధికి వెన్నంటి ప్రోత్సహించే వ్యక్తి అని కొనియాడారు. అదే విధంగా రాబోయే రోజుల్లో ప్రతి గ్రామ మండల నియోజకవర్గ స్థాయిలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయడం జరుగుతోందని మరీముఖ్యంగా పరిశ్రమలు స్థాపించాలి అనుకొనే వారు భయాందోళనలు వదిలేసి పరిస్థితిలను బట్టి అవగాహన పెంచుకోవాలి అని అప్పుడే మార్గం సుగమమం అవుతుందన్నారు. సోషల్ వెల్ఫేర్ అధికారి సరస్వతీ మాట్లాడుతూ అట్టడుగు వర్గాలు, మహిళల కోసం భారత రాజ్యాంగం లో ఆనాడు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ అనేక హక్కులు కల్పించడం జరిగి నది అని వాటి ద్వారా అట్టడుగు వర్గాలు,మహిళలు అభివృద్ధి లోకి రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి సిక్కి ప్రతినిధులు మరియు పారిశ్రామిక వేత్తలు గా ఎదగాలి అని కోరిక ఉన్న వారు హాజరయ్యారు.

## ఊళ్లు నిర్మిస్తున్న చరిత్ర సీఎం జగనన్నదే

గోనెగండ్ల ప్రజాపాలన న్యూస్:- ఎమ్మిగనూరు నియోజకవర్గం గోనెగండ్ల మండల పరిధిలోని తిప్పనూరు, వేముగొడు గ్రామాల్లో రైతు బిడ్డ, నియోజకవర్గ సీనియర్ నాయకుడు "ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి" , లేఅవుట్లలో ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేసి తిప్పనూరు మరియు వేముగొడు గ్రామంలో 63 మంది మహిళలకు పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొంతింటి కలను నేరవేర్చేందుకు జగనన్న చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. పేదల ముఖాల్లో చిరునవ్వే ఆశయంగా జగనన్న పాలన సాగుతోందన్నారు. పార్టీలు, కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నారని కొనియాడారు. పట్టా ఇవ్వడంతో పాటు ఇంటిని కూడా కట్టించే బాధ్యతను సీఎం జగన్ తీసుకున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హామీలన్నింటినీ అమలు చేస్తున్న జగనన్న పాలన చరిత్రలో ఓ సువర్ణ అధ్యాయంగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ సోమశేఖర్ రెడ్డి, తహశీల్దార్ వేణుగోపాల్ , స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ సుధాకర్ , పోలీసు ఉన్నతాధికారులు, పెద్ద రెడ్డి, నరసింహ్మా రెడ్డి, నాగేష్ రెడ్డి, శ్రీరాం రెడ్డి, సయ్యద్ చాంద్, నజీర్ ఆహ్మద్, వడ్డె రంగన్న, గట్టు ఖాజా, వెంకట్ రెడ్డి, మెకానిక్ బాషా, దారాల శ్రీను, రాజా రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.


అంబేడ్కర్ రాజనీతి ఉద్యమం
Ambedkar Rajaneethi Movement (ARM)
www.ambedkarrajaneethi.com

బహుజనుల కోసం డిమాండ్లు
1. మద్యపానాన్ని నిషేధించాలి
2. మహిళలకు అన్నింటా 50 శాతం రిజర్వేషన్ కల్పించాలి.
3. ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేక నియోజకవర్గాలను ఏర్పాటు చేయాలి.
4. న్యాయ వ్యవస్థలో రిజర్వేషన్లు కల్పించాలి.
5. వెనుకబడిన తరగతులకు చట్ట సభల్లో 50 - రిజర్వేషన్ కల్పించాలి.
6. ఎస్సీ లకు మత స్వేచ్ఛ కల్పించాలి.
7. బుద్ధుడు ప్రవచించిన సమతా భావాన్ని సమర్థించేలా చర్యలు చేపట్టాలి.
8. జనాభా నిష్పత్తి ప్రకారం అన్ని కులాలకు రిజర్వేషన్ కల్పించాలి.
9. రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు పటిష్ఠ చర్యలు చేపట్టాలి.
10. రిజర్వేషన్ల అంశాన్ని రాజ్యంగంలోని తొమ్మిదవ షెడ్యూల్ లో చేర్చాలి.
11. అందరికి ఉచిత విద్య కల్పించాలి. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియంను ప్రవేశ పెట్టాలి.
12. ప్రైవేట్ విద్యాసంస్థలను రద్దు చేయాలి.
ఇప్పటికే ఉన్న ప్రైవేటు విద్యా సంస్థల్ని ప్రభుత్వం తన ఆధీనంలోకి తీసుకోవాలి.
13. ప్రభుత్వ ఉద్యోగులకు, ప్రజా ప్రతినిధులకు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే వైద్యం అందించాలి.
14. ప్రైవేట్ ఆస్పత్రులను రద్దు చేయాలి.
15. పరిశ్రమల్ని జాతీయం చేయాలి. ప్రైవేట్ రంగంలో నడిచే పరిశ్రమల్లో రిజర్వేషన్ కల్పించాలి.
16. ఆధార్ కార్డు ఉన్న ప్రతి పౌరుడికి 2,00,000/- రూపాయలు ఋణం ఇవ్వాలి.
సక్రమ చెల్లింపుపై తరువాత సంవత్సరం రెట్టింపు ఋణం ఇవ్వాలి.
17. భూమిలేని రైతులకు ప్రభుత్వ/దేవాలయ లేదా ఇతరత్రా ఏదైనా 4 ఎకరాల భూమి ఇవ్వాలి.
18. ప్రతి కుటుంబానికి పక్కా ఇల్లు నిర్మించాలి.
19. వలసలను అరికట్టేందుకు ఎక్కడికి అక్కడే గ్రామీణ ప్రాంతాల్లో సరికొత్త సాంకేతిక వ్యవసాయ, కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేయాలి.
20. వ్యవసాయానికి ప్రాధాన్యం ఇచ్చి సేంద్రియ ఎరువుల వాడకాన్ని ప్రోత్సహించాలి.
21. రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధరలను ముందుగానే ప్రకటించాలి.
ఇటువంటి విలువైన అంశాలు ఇంకా ఏవైనా ఉంటే దయచేసి మా దృష్టికి తీసుకురండి.

ఆహ్వానం
అంబేడ్కర్ రాజనీతి ఉద్యమంలో భాగస్వాములుగా చేరేందుకు బహుజనులందరికీ ఆహ్వానం.
జై భీం, జై ఫూలే, జై బహుజన
సెంట్రల్ వర్కింగ్ కమిటీ
అంబేడ్కర్ రాజనీతి మూవ్ మెంట్

# ప్రజాపాలన

**సంపాదకీయం**

**బుధవారం 30 డిసెంబరు 2020**


# మరబొమ్మల్లా మట్టి మనుషులు

కార్పొరేటీకరణ వల్ల వ్యవసాయ రంగం సంక్షోభానికి గురి అవుతుం దనేది స్పష్టం. ప్రభుత్వం ఎన్ని వాదనలు చేసినా రైతులు కోలుకోలేని విధంగా నష్టపోతారనేది ఒక నిండు నిజం. ఈ సంక్షోభాల ప్రభావం మరీ ముఖ్యంగా మహిళా కార్మికులపై దారుణంగా ఉంటుందనడంలో ఎటువంటి సందేహం లేదు.

లక్షలాది రైతులు ఢిల్లీ నగరానికి పోటెత్తారు. కేంద్రప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన మూడు వ్యవసాయ చట్టాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ దేశ రాజధానిని దిగ్బంధం చేశారు. చలిగాడ్పులకు చలించకుండా కొత్త సాగుచట్టాలను ప్రతిఘటిస్తున్నారు. రైతుల ఈ అలుపెరగని పోరాటం ప్రారంభమై 30 రోజులు దాటింది. మూడు డిగ్రీలలో గుడారాలు వేసుకొని ఢిల్లీ సరిహద్దుల్లోనే తిష్ట వేశారు. 80 ఏళ్ళు పైబడ్డ వృద్ధుల నుంచి 10 ఏళ్ళ బాలుర దాక గడ్డ కట్టించే చలిలో రోడ్లపై దీక్షలో కూర్చున్నారు. ఈ ఎదురీత వ్యవసాయరంగ చరిత్రలోనే అరుదైనది. దేశం అన్ని మూలల నుంచి సాంస్కృతిక సాహిత్య రంగాలతో బాటు అన్ని రంగాలవారు ఈ పోరాటానికి మద్దతు తెలుపుతున్నారు. ఢిల్లీకి సమీపంలో ఉన్న ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల రైతులు కూడా పంజాబ్, హర్యానా రైతులతో కలిసి పోరాటంలో పాల్గొంటున్నారు. ఈ పోరాటానికి దేశవ్యాప్తంగా సకల రైతులు మద్దతు తెలపడానికి ప్రధాన కారణం నరేంద్రమోదీ ప్రభుత్వం వ్యవసాయ ఉత్పత్తి మార్కెట్ వ్యవస్థలను కార్పొరేట్ పరిధిలోకి మార్చటమే.

కొత్త వ్యవసాయచట్టాలు తమ వ్యవసాయాన్ని ధ్వంసం చేస్తాయని రైతులు అభిప్రాయపడుతున్నారు. అంబానీ లాంటి కార్పొరేట్ కుబేరులు వ్యవసాయరంగంపై పెత్తనం వహించేలా చేయడమే ఈ కొత్తచట్టాల లక్ష్యమని రైతులు నమ్ముతున్నారు. గత ముప్పై ఏళ్ళ సరళీకరణ, ప్రైవేటీకరణ అభివృద్ధి నమూనా తమకు చేదు అనుభవాలనే మిగిల్చాయని రైతులు భావిస్తున్నారు. కొత్త సాగుచట్టాలు సేద్యరంగాన్ని పూర్తిగా కార్పొరేటీకరణ చేయనున్నం దున స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన తమ వ్యవసాయ జీవనోపాధులను కోల్పోతామని రైతులు భయపడుతున్నారు. జీవనోపాధులతో పాటు భూమిని కూడా కోల్పోతామని వారు గట్టిగా నమ్ముతున్నారు. తత్కారణంగానే మొక్కవోని పట్టుదలతో ఆ చట్టాలను రద్దు చేసి తీరవలసిందేనని డిమాండ్ చేస్తున్నారు. వీటిని మినహా మరి దేన్నీ తాము అంగీకరించబోమని స్పష్టం చేస్తున్నారు.

రైతుల భయాల లాంటివే గతంలో ఈ వ్యాసకర్త మూడు దశాబ్దాల పాటు నిర్వహించిన ఒక అధ్యయనంలో వెల్లడయ్యాయి. హైదరాబాద్‌కు 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న మెదక్ జిల్లాలోని గ్రామంలో ఆ అధ్యయనాన్ని నిర్వహించాను. 1979లో అధ్యయనం ప్రారంభించిన నాడు ఆ గ్రామంలో వరిపంట ప్రధాన పంటగా ఉండేది. ఆ గ్రామానికి 13 కిలోమీటర్ల దూరంలో ఆసియాలోని చాలా పెద్దదైన పారిశ్రామికవాడ అభివృద్ధి చెందింది. ఈ గ్రామంలో మూడు దశాబ్దాల కాలంలో వచ్చిన మార్పులను పరిశీలిస్తే రైతుల ప్రస్తుత భయాందోళనలకు సాక్ష్యాధారాలు స్పష్టంగా కనిపిస్తాయి. ఆ గ్రామంలో, ముఖ్యంగా వ్యవసాయరంగంలో వస్తున్న మార్పుల గురించి 1979, 1995-96లో, 2009-10లలో జరిపిన మూడు సర్వేలలో అధ్యయనం చేశాం. ఈ మూడు సర్వేలలోనూ గ్రామంలో అవే కుటుంబాల నుంచి వ్యవసాయ సంబంధిత సమాచారాన్ని సేకరించాం. మహిళల జీవనాధారాలైన వ్యవసాయవృత్తులు, మహిళల పనులలో మార్పులు, వారి జీవనస్థాయిలలో మార్పుల వంటి అంశాలు ఈ అధ్యయనంలో ఉన్నాయి. అందులోనూ మహిళల జీవనవృత్తులు, జీవనస్థాయిలపై ప్రైవేటీకరణ, కార్పోరేటీకరణల ప్రభావాలు ప్రధాన అంశాలుగా ఉన్నాయి.

ప్రస్తుత రైతుల పోరాటంలో మహిళా రైతులు పూర్తి నిబద్ధతతోను, సంపూర్ణ అవగాహనతోను తమ పాత్రను నిర్వహిస్తున్నారు. ఉదాహరణకు హరిందర్ బిందూ లాంటి మహిళా నాయకురాలు ఎన్నో గ్రామాలకు వెళ్ళి కార్యకర్తలను చైతన్యపరుస్తున్నారు. పోరాట లక్ష్యాలపై అవగాహన కల్పిస్తున్నారు. అయినా మహిళల భూమికపై సరైన చర్చ జరగడం లేదు. పోరాట ప్రదేశంలో ఎంతోమంది మహిళలు పురుషులతోబాటు క్రియాశీలంగా పాల్గొంటున్నారు. ఒకవేళ పోరాటప్రాంతానికి పోలేకపోతే, పంటలను రక్షించుకునే పనిలో ఉండటం, పోరాటంలో పాల్గొంటున్న పురుషులకు కావలసిన సదుపాయాలను సమకూర్చటం లాంటి ఎన్నో బాధ్యతలను నిర్వహిస్తున్నారు. మహిళల పాత్ర లేనట్లయితే ఈ పోరాటానికి సమస్యలు ఎక్కువగా ఉండేవి. ఈ బాధ్యతలన్నీ వీరు నిర్వహించినా అవేవీ చర్చకు రావటం లేదు.

ఈ వ్యాసకర్త సేకరించిన సమాచార విశ్లేషణలోకి వెళితే మొదటి సర్వేకాలం నాటికి (1979%--%-80) గ్రామ కుటుంబాలలో 82 శాతం వ్యవసాయమే జీవనాధారంగా కలిగి ఉన్నాయి. ఈ వ్యవసాయ కుటుంబాలలో 62 శాతం మహిళా కార్మికులున్నారు. ఈ అంశం వ్యవసాయరంగ మనుగడకు సంబంధించి చాలా ప్రధానమైనది. గ్రామంలో ఉన్న మొత్తం భూమిలో 90 శాతం భూమి వ్యవసాయభూమిగా ఉండేది. ఆ భూమికి కావలసిన అభివృద్ధి కార్యక్రమాలకు, నీటిపారుదల ఇత్యాది వసతుల కల్పనకు ప్రభుత్వమే బాధ్యత వహించింది. కాబట్టి చిన్న, సన్నకారు రైతులు వ్యవసాయంలో మనగలిగారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలలో భాగంగా హరిత విప్లవ సాంకేతిక పరిజ్ఞానాన్ని వ్యవసాయాభివృద్ధి కోసం అనుసంధానం చేయడం జరిగింది. వరి ఒక అత్యవసర పంట. దీనికి పేదరికాన్ని తగ్గించే శక్తి ఉన్నది. ప్రత్యేకించి 70వ దశకంలో వరిపంట సాగుకు ప్రాధాన్యమిచ్చారు. వరి పంటలో మహిళాకార్మికుల పాత్ర కీలకమైనది. హరితవిప్లవానికి నీటిపారుదల తోడై ఆ సమయంలో వ్యవసాయకుటుంబాల ఆదాయాలు వేగంగా పెరిగాయి. ఇలాంటి కారణాల మూలంగా కరోనా సంక్షోభ కాలంలో వలస కార్మికులు తమ గ్రామాలకు చేరితే ఆహారానికి సమస్య ఉండదంటూ చిన్న పిల్లలను చంకలో ఎత్తుకొని, మూటలు తలపై మోసుకొని వందల కిలోమీటర్లు కాలినడకన వెళ్లారు. కార్పొరేట్ సంస్థల ప్రాబల్యం వల్ల లక్షల టన్నుల ధాన్యం గోడౌన్‌లలో ఉన్నా వలస కార్మికులను ఆదుకునే ప్రయత్నం జరగలేదు!

1990 దశకంలో ఆర్థిక సంస్కరణల పేరుతో జరిగిన మార్పుల వల్ల అంతకు ముందు ఎన్నడూ లేని విధంగా వ్యవసాయరంగం మార్కెట్ ఆధారిత ఉత్పాదకాలు వాడటం, ఆ రంగంలో అమలుపరుస్తున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ప్రభుత్వం ఉపసంహరించుకోవటం మొదలైన పెను మార్పులు జరిగాయి. 1995-96లో జరిపిన రెండవ సర్వే నాటికి సరళీకరణ, ప్రైవేటీకరణ ప్రక్రియలు ఊపు అందుకుని వ్యవసాయ ఉత్పాదకాల ధరలపై ప్రభుత్వ నియంత్రణ లేకుండాపోవటం వల్ల రైతులపై అధిక ధరల భారం పడింది. దీనితో సన్నచిన్న రైతులు తమ భూమిలో సాగుకు బదులు వ్యవసాయేతర పనులకు మారడం ప్రారంభమయింది. ఇక 2009%--%-10లో మూడవ సర్వే నాటికి సన్నకారు, చిన్నకారు రైతులు తమ కమతాలను అమ్మడం, వారు దిగుబడి చేసిన అల్ప ఉత్పత్తుల ధరలు ఉత్పాదకాల ధరలలాగ పెరగకపోవడం వల్ల ఒక ఎకరంలో రైతు వరిపంటకు దాదాపు రూ.10,000 నష్టాన్ని భరించవలసి వచ్చింది.

సన్నకారు, చిన్నకారు రైతులు ఈ పరిస్థితులను తట్టుకోలేక రోజువారీ వేతన పనులకు వెళుతూ, రోడ్లు వేసే కాంట్రాక్టర్లకు తమ పంటభూముల నుంచి మట్టి అమ్ముకొని జీవనం గడిపే దయనీయమైన స్థితి వచ్చింది. మట్టి తీయడం వల్ల గుంతలు పడిన భూములు వర్తమానంలో గానీ, భవిష్యత్తులో గానీ సాగుకు ఎందుకూ పనికిరాకుండా పోయాయి. తాతల కాలం నుంచి భద్రజీవితానికి ఆసరా ఇచ్చిన వ్యవసాయ భూములపై ఆధారపడలేక ఉపాధుల కోసం వ్యవసాయేతర రంగాలకు మారడానికి సిద్ధమయ్యారు. ఆసియాలోనే అతిపెద్దదైన పారిశ్రామికవాడగా వృద్ధి చెందిన ఆ ప్రాంతంలో వ్యవసాయ ఉత్పత్తుల నుంచి బయటికి వచ్చిన మహిళలకు ఆ పరిశ్రమలు గౌరవప్రదమైన ఉపాధులను కల్పించలేదు. చాలామంది గృహిణులుగా ఇంటి పనులకు పరిమితమై ఉత్పత్తి కార్మికులుగా తమ అస్తిత్వం పోగొట్టుకున్నారు. ఇక విద్యావంతులైన వారి పిల్లలను ఆ పరిశ్రమలలోకి తీసుకున్నా భద్రత కొరవడిన ఉద్యోగాలవి. వారికి అతి స్వల్ప వేతనాలు మాత్రమే లభించాయి.

మొట్టమొదట ఈ పరిశ్రమల స్థాపన, ఆ గ్రామంలోని ప్రభుత్వ భూమి సేకరణతో మొదలయింది. రైతులకు రక్షణగా ఉన్న ప్రభుత్వం కమిషన్ ఏజెంట్‌లా మారి రైతుల పంటభూములను కొని ధరల యంత్రాంగాన్ని చురుకుగా ఏర్పరచి ప్రైవేటు పరిశ్రమలకు భూమిని ఇవ్వడం మొదలు పెట్టింది. గతంలో ఆ గ్రామచరిత్రలో అలా ఎప్పుడూ జరగలేదు. ప్రభుత్వం రైతుల నుంచి 40 ఎకరాల భూమిని సేకరించి ప్రైవేటు పరిశ్రమలకు ఇచ్చింది. దీనితో స్పెక్యులేటివ్ బిజినెస్ (సట్టా వ్యాపారం) ఊపందుకొన్నది. భూమికి ధర పెరిగి మార్కెట్‌లో అమ్మే వస్తువుగా మారిపోయింది.

ఎన్ని పరిశ్రమలు పెట్టినా రెండోతరం విద్యావంతులకు కూడా సుస్థిరమైన ఉద్యోగాలు రాలేదు. శ్రమ దోపిడీ యథేచ్ఛగా కొనసాగింది. పరిశ్రమల యాజమాన్యాలు అత్యధిక లాభాలను అత్యల్ప సమయంలో సముపార్జించుకునే లక్ష్యంగా ఆ ఉద్యోగాలు ఉన్నాయనేది ఒక కఠోర వాస్తవం. తత్ఫలితంగా పని పద్ధతులన్నీ లభాలు సమకూర్చేవిగా మాత్రమే మిగిలిపోయాయి. ఉదాహరణకు ఈ పరిశ్రమలు విధించిన నియమాల ప్రకారం అమ్మాయిలు ఉద్యోగాలు పొందేందుకు పెళ్ళి కానంతవరకే అర్హులు. ఈ అమ్మాయిల వయసు 18-19 ఏళ్ళ మధ్య ఉండాలి. దీంతో 20-21 సంవత్సరాలకు వారికి పెళ్ళి కాగానే ఉద్యోగం ఊడిపోతుంది. ఇలా అమ్మాయిల ఉద్యోగం ఊడటంతో, కొత్త అమ్మాయిలను మళ్ళీ అవే షరతులతో ఉద్యోగంలోకి తీసుకోవడం వల్ల, వీళ్లు అస్థిరకార్మికులు (ఫ్లోటింగ్ లేబర్)గా మాత్రమే మిగిలారు.

లేదా ట్రైనింగ్ ఉద్యోగాలల్లో ఉన్నందున వారికి స్టైఫండు ఇస్తారు. అది వేతనం కాదు కాబట్టి, వీరి పనికి ఉత్పత్తితో ముడిపడిన శ్రమగా గుర్తింపు వచ్చే అవకాశాలే లేవు.

ఈ అభివృద్ధి అనుభవాన్ని పరిశీలిస్తే గ్రామంలో వ్యవసాయరంగం కార్పొరేటీకరణ వల్ల సంక్షోభానికి గురి అవుతుందనేది స్పష్టం. మొత్తం అభివృద్ధి నమూనాలో రైతులే కాక మహిళలు మరింత ఎక్కువగా నష్టపోతారు. ఈ అంశం మీద లోతైన చర్చ జరగవలసిన అవసరముంది. ఇలాంటి చేదు అనుభవాల వల్లే ఇవాళ రైతులు, వారి కుటుంబసభ్యులు అందరూ పోరాటంలో భాగమయ్యారు. ప్రభుత్వం ఎన్ని వాదనలు చేసినా కార్పొరేటీకరణ వల్ల వ్యవసాయరంగం కోలుకోలేని దెబ్బ తింటుందనేది ఒక నిండు నిజం. ఈ సంక్షోభాల ప్రభావం మహిళా కార్మికులపై దారుణంగా ఉంటుందనడంలో ఎటువంటి సందేహం లేదు.

# అవినీతి ప్రక్షాళన ఎలా?

అధికార వ్యవస్థలో అవినీతి ప్రక్షాళనకు ఉద్దేశించిన సంస్కరణలు ఎప్పుడు సఫలమవుతాయి? పై స్థాయిలో ప్రభుత్వం, కింది స్థాయిలో ప్రజలు దృఢసంకల్పంతో పటిష్ఠంగా వ్యవహరించినప్పుడు మాత్రమే వ్యవస్థలో మేలు మార్పులు సంభవిస్తాయి. సుపరిపాలన సుసాధ్యమవుతుంది.

వస్తు సేవల పన్ను (జీఎస్టీ)ను అమలుపరచడం ప్రారంభమైన తరువాత దొంగ వ్యాపారాలు పెరిగిపోతాయని, అంతటా నల్ల బజారు విలసిల్లగలదనే భయాన్ని ఈ వ్యాసకర్త ఐదు సంవత్సరాల క్రితం వ్యక్తం చేశాడు. జీఎస్టీ అమలులోకి రాకముందు అక్రమ వ్యాపారి ముగ్గురు అధికారులను ‘మంచి’ చేసుకోవలసి ఉండేది. వారు- ఎక్సైజ్, అమ్మకం, రవాణా పన్ను అధికారులు. జీఎస్టీతో ముగ్గురికి బదులుగా ఒకే ఒక్క అధికారితో ‘సత్సంబంధాలు’ నెరపితే సరిపోతుంది. మరి ఈ సౌలభ్యం, దేశ ఆర్థిక వ్యవస్థలో అక్రమ లావాదేవీలు మరింతగా పెచ్చరిల్లిపోయేందుకు దారి తీయలేదూ?

అధికారయంత్రాంగంలో అవినీతిని నియంత్రించేందుకు ప్రభుత్వం పలు పటిష్ఠ చర్యలను అమలుపరిచింది. అత్యంత ప్రభావశీల చర్య అవినీతికి పాల్పడిన అధికారులతో బలవంతంగా ఉద్యోగ విరమణ చేయించడం. అయితే, ఐఏఎస్ అధికారులు తమ శ్రేణుల్లో అవినీతిపరులను గుర్తించడానికి సుముఖత చూపడం లేదు!

మనం భిన్నంగా ఆలోచించవలసి ఉంది. ‘ప్రాతినిధ్యం, అందుబాటు, సమధర్మం, న్యాయవర్తన’ గురించి అమెరికా వ్యవస్థాపకులు విశేష శ్రద్ధ చూపడం వల్లే అమెరికా ప్రభుత్వ యంత్రాంగంలో ఆ నాటి నుంచి ఈనాటికీ అవినీతి స్వల్ప స్థాయిలో ఉంటుందని ప్రొఫెసర్ జాన్ జోసెఫ్ వాల్లిస్ (మేరీల్యాండ్ విశ్వవిద్యాలయం) పేర్కొన్నారు. ప్రభుత్వ నిరంకుశత్వానికి వ్యతిరేకంగా ప్రజలకు సంపూర్ణ సాధికారత కల్పించాలని అమెరికా రాజ్యాంగ నిర్మాతలు ఆకాంక్షించారు. సివిల్ సర్వెంట్లకు ప్రాధాన్యమిస్తూ అవినీతి వ్యతిరేక చర్యలు సాధించిన లేక సాధించని ఫలితాలను ఇటీవల ‘వరల్డ్ డెవలప్‌మెంట్’లో వెలువడిన ఒక వ్యాసం సమగ్రంగా సమీక్షించింది. ఈ అధ్యయనంలో సివిల్ సర్వెంట్ల తీరుతెన్నులను నిశితంగా పరీక్షించారు. అవినీతి నిరోధక సంస్థల (మన పోలీసు శాఖ, కేంద్ర నిఘా సంఘం లాంటివి) పని తీరు ప్రభావశీలంగా లేదని ఆ అధ్యయనంలో వెల్లడయింది. అయితే ‘అవినీతి తనిఖీ’ (కరప్షన్ ఆడిట్- చట్టాలు, నిబంధనలను ఒక సంస్థ ఏ మేరకు పాటిస్తుందనే విషయమై స్వతంత్ర, విశ్వసనీయ మదింపునకు ఆ సంస్థ ఖాతాలు, వ్యాపార ప్రక్రియలు, సిబ్బంది పనితీరును అంతర్గత లేదా బాహ్య వ్యక్తులు, సంస్థలు పరీక్షించడం) మంచి ఫలితాలను సాధించినట్టు ఆ అధ్యయనం స్పష్టం చేసింది. సివిల్ సర్వెంట్, వ్యాపారస్థుడు పరస్పరం సహకరించుకుంటున్నందువల్లే అవినీతి జరగడం కద్దు. లంచం ఇచ్చినవాడు -పుచ్చుకున్న వాడి మధ్య వివాదం తలెత్తినప్పుడు మాత్రమే సదరు బాగోతాలు అవినీతి నిరోధక సంస్థల దృష్టికి వచ్చి, వాటిపై దర్యాప్తునకు పూనుకోవడం జరుగుతోంది. అవినీతి తనిఖీ ప్రక్రియలో, అందుకు భిన్నంగా ఒక ప్రభుత్వ కార్యాలయాన్ని ఒక అధికారి తనిఖీ చేస్తాడు. తమకు ముడుపులు ముట్టేంతవరకు ప్రభుత్వ ఉన్నతాధికారులు తమ వద్దకు వచ్చిన ఫైళ్ళ విషయంలో




ఎలా వ్యవహరిస్తారో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. వారికి విధిగా ముడుపులు చెల్లించినపుడే ఆ ఫైళ్ళను పరిశీలించేందుకు సుముఖత చూపుతారు.

ఒక నిర్దిష్ట అధికారి వద్దకు చేరిన ఫైళ్ళు ఎంత త్వరగా పరిశీలన, నిర్ణయానికి అర్హమవుతున్నాయనే విషయాన్ని నిశితంగా పరీక్షించడం ద్వారా ఒక ప్రభుత్వ శాఖలో అవినీతి ఏ స్థాయిలో ఉందనేది స్పష్టమవుతుంది.

అవినీతి నియంత్రణలో మీడియా, పౌరసమాజాల పాత్ర కీలకమైనదని ప్రొఫెసర్ ఇర్కోల్ డిసౌజా (ఐఐఎమ్, అహ్మదాబాద్) అన్నారు. న్యాయవ్యవస్థను కూడా నేను ఆ జాబితాలో చేర్చుతాను. అధికార యంత్రాంగంలో అవినీతిని మీడియా, పౌర సమాజం గుర్తించగలుగుతాయి. పోలీసు అధికారుల అక్రమాలను పియుసిఎల్ బహిర్గతం చేసిన విషయం విదితమే.

క్లాస్ ‘ఏ’ అధికారుల విధుల నిర్వహణను ప్రభుత్వేతర వ్యక్తులతో మూల్యాంకనం చేయించాలని ఐదో వేతనసంఘం నిర్దేశించింది. ఇందుకు పటిష్ఠచర్యలు చేపట్టిన తరువాతనే సిబ్బంది వేతనభత్యాల విషయమై తమ సిఫారసులను అమలుపరచాలని ఆ వేతనసంఘం స్పష్టం చేసింది. ప్రభుత్వ యంత్రాంగం ప్రజలకు అందుబాటులో ఉండడం, అవినీతి తనిఖీ, మీడియా, పౌర సమాజం, న్యాయవ్యవస్థకు మరింత సాధికారత కల్పించడం... ఈ సూచనలన్నిటిలోని సామాన్యాంశం స్వతంత్ర వ్యక్తులకు సాధికారిత కల్పించడమే. అవినీతికి పాల్పడిన అధికారులను బలవంతంగా ఉద్యోగ విరమణ చేయించడం వంటి ఉన్నతస్థాయి నుంచి చేపట్టే దండనచర్యలకు అవినీతి తనిఖీ పూర్తిగా భిన్నమైనది. ప్రభుత్వం పై నుంచి చేపట్టే చర్యల విషయంలో ఎంత చిత్తశుద్ధితో వ్యవహరించినప్పటికీ అవి నిష్ప్రయోజనమైపోతున్నాయి.

స్వతంత్ర పర్యవేక్షణకు ఆస్కారం కల్పించడంలో ఉన్న సమస్యేమిటంటే అవినీతిపరులైన అధికారులే కాకుండా సామాన్య ప్రజలు సైతం ప్రభుత్వ విధానాలు, చర్యలపై నిశితప్రశ్నలు లేవనెత్తుతారు. ఒక రోడ్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ జారీ చేసిన ఒక తప్పుడు చలానాకు వ్యతిరేకంగా ఒక పౌరుడు కేసు దాఖలు చేయవచ్చు. అయితే అదే పౌరుడు మోటార్ వాహనాల చట్టంలోని లొసుగుల విషయాన్ని ప్రశ్నించగలుగుతాడు. లేదా న్యాయవ్యవస్థ సంబంధిత ప్రభుత్వ విధానాలను ప్రశ్నిస్తుంది. ఈ కారణంగా ప్రజల ప్రాతినిధ్యాన్ని మెరుగుపరిచేందుకు, అవినీతి తనిఖీలను నిర్వహించేందుకు, మీడియా, పౌర సమాజం, న్యాయవ్యవస్థకు మరింత సాధికారత కల్పించేందుకు లేదా అధికారుల విధి నిర్వహణ తీరుతెన్నులను బాహ్య సంస్థలు లేదా ప్రభుత్వేతర వ్యక్తుల చేత మూల్యాంకనం చేయించేందుకు ప్రభుత్వాలు తిరస్కరిస్తున్నాయి. ఇది, అమెరికా రాజ్యాంగ నిర్మాతలు నిర్దేశించిన పద్ధతులకు విరుద్ధమైనది. అధికార వ్యవస్థలో అవినీతి నియంత్రణలో స్వతంత్ర వ్యక్తుల పాత్రను తగ్గించేందుకు ప్రభుత్వం పలు విధాల ప్రయత్నిస్తోంది. ఫలితంగా అవినీతిపరులైన అధికారులపై చర్యలు వ్యర్థమవుతున్నాయి. ఉదాహరణకు, అవినీతిపరులైన జీఎస్టీ అధికారులకు వ్యతిరేకంగా ఫిర్యాదు చేసే సాధికారితను ట్రక్ యజమానుల సంఘానికి కల్పించారను కోండి. ఆ సంఘం మోటార్ వాహనాల చట్టంలోని నిర్దిష్ట నిబంధనలను సైతం ప్రశ్నించే అవకాశం ఎంతైనా ఉంది.

అవినీతికి పాల్పడిన అధికారులతో బలవంతంగా ఉద్యోగ విరమణ చేయించడం వంటి చర్యల ద్వారా ప్రభుత్వం అధికార యంత్రాంగం తీరుతెన్నులను ఏ మాత్రం మెరుగుపరచలేదు. ‘ఏం చేయాలి? మేం చాలా మంది పోలీసు అధికారులను బర్తరఫ్ చేశాం. అయినా వాళ్లు విధులు నిర్వహిస్తున్న తీరులో ఎటువంటి మార్పులేదు’ అని ఉత్తరప్రదేశ్ మంత్రి ఒకరు వాపోయారు. పీయుసిఎల్ సహాయాన్ని ఆయన తీసుకుని ఉండాల్సిందని నేను అభిప్రాయపడుతున్నాను. అధికార వ్యవస్థలో అవినీతి ప్రక్షాళనకు ఉద్దేశించిన సంస్కరణలు ఎప్పుడు సఫల మవుతాయి? పై స్థాయిలో ప్రభుత్వం, కిందిస్థాయిలో ప్రజలు దృఢసంకల్పంతో పటిష్ఠంగా వ్యవహరించినప్పుడు మాత్రమే వ్యవస్థలో సరైన మార్పులు సంభవిస్తాయి. సుపరిపాలన సాధ్యమవుతుంది. ఇప్పుడు ప్రభుత్వం ముందు రెండే రెండు ప్రత్యామ్నాయాలు ఉన్నాయి. ఒకటి,- అవినీతితో అంటకాగడం. దీనివల్ల అధికారాన్ని పూర్తిగా కోల్పోవలసివస్తుంది. రెండు,- తన విధానాలను ప్రశ్నించేందుకు ప్రజలకు సంపూర్ణ స్వేచ్ఛనివ్వాలి. అయినప్పటికీ అధికారాన్ని నిలబెట్టుకునేందుకు ఆస్కారముంటుంది.

## నూతన వ్యవసాయ చట్టాలను రద్దు చేయాల్సిందే

రిలే దీక్ష శిబిరంలో సిపిఐ నేత ఇంటూరి



**పెనుగంచిప్రోలు, డిసెంబర్ 29 (ప్రజాపాలన) :** కేంద్రప్రభుత్వం రైతుకు తీ వ్ర నష్టంకలిగించేలా నూత నంగా తీసుకోసిన వ్యవ య చట్టాలను రద్దు చేయాలని సిపిఐ నియోజక కార్యదర్శి ఇంటూరినాగేశ్వరావు టీడీపీ. మండల అధ్యక్షులు చింతల. సీతారామయ్య. సిపిఎం. నాయకులు దార. నాగేశ్వరావు లు కేంద్ర ప్ర భుత్వం ను డిమాండ్ చేశారు,ఢిల్లీలో పోరాటం చేస్తు న్న రైతు ల ఉద్యమాన్ని కి మద్ద తు గా మంగళవారం పెనుగంచిప్రోలు లోని పాత సినిమా హాల్ సెంటర్ వ ద్ద అఖిల పక్ష రైతు సంఘ లు ఏర్పాటు చేసిన రిలే దీక్ష శి బిరం లో వీరు మాట్లాడు తూ దేశంలో రెండోసారి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం తీసుకొచ్చిన నూతనా వ్యవసాయ చట్టలతో రైతు లు దారుణం గా నష్ట పోతరన్ని అన్నారు. వాటిని రద్దు చేయాలని ఢిల్లీ కేంద్రంగా లక్షల రైతు కుటుంబాలు ముక్తకాంటం తో డిమాండ్ చేస్తున్న మోదీ ప్రభుత్వం నుంచి ఎ లాం టి స్పందన లేకపోవటం బాధకరామానారు. ప్ర జాస్వామ్యంలో ప్రశ్నించే వారిని అరెస్టులు చేస్తూ దే శంలో హిట్లర్ విధాన్నాలనుఅవలంబిస్తున్నారన్నారు. ఎన్నో పోరాటల తో సాధించుకున్న కార్మిక చట్టాలను కాలరాస్తున్నారు. కార్పొరేట్ శక్తులకు అనుకుంలంగా ప్రజా వ్యతిరేక విదా నాలను అవాలంబిస్తున్న కేంద్ర ప్రభుత్వ చర్యలను ప్రతిఒకరు ప్రతిగటించాలని పే ర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నా య కులు వ ల్లం కొండ. బ్రహ్మ మం. మాజీ ఎంపీపీపొన్నం. నరసింహ రావు. జక్కులూరి. వెంకటేశ్వర్లు. టీడీపీ నాయకులు మాజీ సర్పంచ్ జిలే పల్లి. సుదీర్ బాబు. నల్లపూనేనికొండా. కనపర్తిశ్రీను.తాటిపూడి సత్యాం బాబు. సిపిఎం నాయకులు పిడిమర్తి. బాబు. తురక. కొండలుజిదన్నమ్మ. అక్కులు,టీడీపీ గ్రామఅధ్యక్షులు కొత్తపల్లి. సతీష్ కుమార్ తదితరులు పాల్గొ న్నారు.

## అక్రమ మద్యం స్వాధీనం



**పెనుగంచిప్రోలు, డిసెంబర్29 (ప్రజాపాలన) :** పెనుగంచిప్రోలు పోలీసులకు రాబడిన సమాచారం మేరకు పెనుగంచిప్రోలు మండలం నవాబుపేట గ్రామానికి చెందిన నంబూరి సాంబశివరావు అనే వ్యక్తి వద్ద తనిఖీలు చేయగా 120 కోటర్ బాటిల్స్ ను స్వాధీనం చేసు కొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పెనుగంచిపోలు ఎస్ఐ గరికపాటి రామకృష్ణతెలిపారు.

## కొత్త కరోనా (స్ట్రెయిన్)తో జాగ్రత్తగా ఉండాలి

*'డా!సింగరాజు సాయికృష్ణ'*



**నరసరావుపేట, ప్రజాపాలన :** కోవిడ్ పట్ల మరింత అప్రమత్తంగా ఉండాలి అని "డాక్టర్ సింగరాజు సాయికృష్ణ" స్థానిక పల్నాడు రోడ్ లోని అనన్య హాస్పిటల్స్ నందు జరిగిన విలేకరుల సమవేశంలో లో ప్రముఖ ఊపిరితిత్తుల వైద్య నిపుణులు "డా! సింగరాజు సాయి కృష్ణ" తెలియచేశారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ కొత్తరకం కరోనా స్టెయిన్ యూకే లో మొదలై మన దేశం లో ప్రవేశించింది అని కేంద్ర ప్రభుత్వం స్పష్టత చేసింది అని అందువలన అందరూ కూడా గత అనుభవలను దృష్టిలో పెట్టుకొని తగిన వ్యక్తి గత జాగ్రత్తలు తీసుకోవాలి అని సూచించారు . ఈ కొత్త రకం స్ట్రెయిన్ గతం లో కరోనా వైరస్ రకం కంటె చాలా వేగంగా వ్యాపిస్తుంది అని (సుమారు 60-70 %) ప్రజలు అందరూ చాలా అప్రమత్తంగా ఉంటూ మాస్క్ ముఖ్యంగా విది గా ధరించాలని, సామాజిక దూరం పాటిస్తూ గుంపులు గుంపులుగా ఉండకుండా ఉంటే వ్యాప్తిని అరికట్టవచ్చు అని తెలియచేశారు. ఈ వ్యాధి లక్షణాలు ముందు రకం కోవిడ్ వైరస్ లాగానే ఉంటాయని,ఏటువంటి అనుమానిత లక్షణాలు ఉన్న నిర్లక్ష్యం చేయకుండా వైద్యుల సలహాలు,సూచనలు తీసుకోవాలి అని విదేశీ ప్రయాణాలు చేసి వచ్చిన వారు ఎవరైనా అధికారులకు సమాచారం ఇచ్చి కోవిడ్ పరీక్షలు చేయించుకోని 14 రోజులు స్వీయ నియంత్రణలో ఉండాలని సూచించారు .రానున్న కొత్త సంవత్సరం వేడుకలు మరియు పండగలు దృష్టిలో పెట్టుకొని తగుజగ్రత్తలు తీసుకోనీ ఈ కొత్త రకం కరోనా స్ట్రెయిన్ బారిన పడకుండా అందరూ కూడా అప్రమత్తంగా ఉండాలి అని "డా!సింగరాజు సాయికృష్ణ" కోరారు.




# జగనన్న ఇళ్ల పట్టాల పంపిణీకి సర్వం సిద్ధం చేసిన అధికారులు



**బుధవారం నుంచి కారంపూడి మండలంలో పట్టాల పండుగ ప్రారంభం**

**మాచర్ల ఎమ్మెల్యే ప్రభుత్వవిప్ పిన్నెల్లి.రామకృష్ణరెడ్డి చేతులమీదుగా పేదవర్గాలకు పట్టాలు పంపిణి**

**కారంపూడి తహసీల్దార్ జె. ప్రసాదరావు, ఎంపిడిఓ బాలునాయక్ వెల్లడి**

**కారంపూడి, ప్రజాపాలన :** వైయస్ ఆర్‌బిజగనన్న కాలనీ ఎంపికైన గూడులేని నిరుపేదలకు పట్టాల పంపిణి కార్యక్రమం బుధవారం కారంపూడి మండలం లో మాచర్ల ఎమ్మెల్యే ప్రభుత్వవిప్ పిన్నెల్లి. రామకృష్ణరెడ్డి చేతుల మీదుగా పంపిణి కార్యక్రమం జరుగుతుంది అని తహసీల్దార్ జె. ప్రసాదరావు, ఎంపిడిఓ బి. బాలునా యక్ లు తెలిపారు. ఈ కార్యక్రమం మొదటిగా నరమాలపాడు గ్రామంలో ప్రారంభం అవుతుంది అని ఆ తరువాత ఒప్పిచర్ల, మిరియాల, పెదకొదమ గుండ్ల, చిన్నకొదమ గుండ్ల, గాదెవారిపల్లి, ఇనపరాజు పల్లి, కాచవరం గ్రామాలలో పట్టాల పంపిణి కార్యక్రమం నిర్వహించను న్నట్లు వారు తెలిపారు ఈ కార్యక్రమనికి ముఖ్యఅతిధులు గా నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు. శ్రీకృష్ణదేవరాయలు, వైసీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధానకార్యదర్శి పిన్నెల్లి. వెంకటరామిరెడ్డి, గురజాల ఆర్డిఓ పార్ధసారధి, హాజరవుతారని వారు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న నవరత్నాల కార్యక్రమం లో భాగంగా అర్హులైన పేదవారికి ఇంటి పట్టా పంపిని చేయటం జరుగుతుంది అని వారు తెలిపారు నరమాలపాడు 154, ఒప్పిచర్ల 244, మిరియాల 135, పెదకొదమగుండ్ల 148, చినకొదమగుండ్ల మరియు వేపకంపల్లి 58, గాదెవారిపల్లి 103, కాచవరం 57 మంది అర్హులైన లబ్ధిదారులకు ఈ సందర్భంగా పట్టాలు పంపిణి చేయటం జరుగుతుంది అని తహసీల్దార్ ఎండివో తెలిపారు. పంపిణికి సంబందించి సర్వం సిద్ధం చేసినట్లు వారు తెలిపారు. మండల స్థాయి అధికారులు ప్రజాప్రతినిధులు, వైసీపీ నాయకులు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, ఆయా గ్రామాల లబ్ధిదారులు పాల్గొని ఈ కార్యక్రమన్ని విజయవంతం చేయాలనీ వారు ఈ సందర్భంగా కోరారు.

# నియోజకవర్గంలో 'నాడు- నేడు' పనుల పరిశీలన



**నరసరావుపేట. ప్రజాపాలన :** నరసరావుపేట పట్టణంలోని కేజీబీవీ పాఠశాల, లింగంగుంట్లలోని శంకర భారతీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో పర్యటించిన రాష్ట్ర బృందం. నియోజకవర్గంలో నాడు -నేడు పనులు చాలా నాణ్యతతో, అద్భుతంగా నిర్మించారు- బుడితి రాజశేఖర్ ,పాఠశాల విద్యా ప్రిన్సిపాల్ సెక్రటరీ. ప్రభుత్వం వారి సూచనలు పాటిస్తూ ,అన్ని రకాల షరతులకు లోబడి నిర్మాణాలు నాణ్యతతో జరిగాయి.- చినవీర భద్రుడు , పాఠశాల విద్యా కమిషనర్. రాష్ట్ర వ్యాప్తంగా మేము పర్యటించిన పాఠశాలల్లో శంకర భారతి పురం పాఠశాలకు టాప్ 5 ర్యాంక్ ఇస్తున్నాం. టాయిలెట్లు అత్యంత నాణ్యతతో నూతన సాంకేతికతను జోడించి నిర్మించారు. ఈ పాఠశాలల్లో సరికొత్త పోకడల తో నిర్మాణాలు జరిపారు చాలా కొత్తగా ఉన్నాయి. వీటిని రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పాఠశాలలు ఆదర్శంగా తీసుకోవాలని సూచిస్తాం. "నాడు-నేడు"ఒక అద్భుతమైన కార్యక్రమం, పాఠశాలల్లో మౌళిక సదుపాయాలు కల్పిస్తూ ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దటం ఒక బృహత్తర కార్యక్రమం ఎమ్మెల్యే డా.గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి. తరగతి గదులు, క్రీడా మైదానం, టాయిలెట్స్ నూతన భవనాల నిర్మాణం కొరకు అధికారులతో చర్చించిన శాసనసభ్యులు . కార్యక్రమంలో పాల్గొన్న నరసరావుపేట శాసనసభ్యులు డా. గోపి రెడ్డి శ్రీనివాసరెడ్డి , పాఠశాల విద్యా ప్రిన్సిపాల్ సెక్రటరీ బుడితి రాజశేఖర్ ,పాఠశాల విద్య కమీషనర్ చినవీర భద్రుడు, సర్వశిక్షా అభియాన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ వేటూరి సెల్వి , నాడు- నేడు ప్రాజెక్ట్ డైరెక్టర్ మురళీ కృష్ణ , డివిసినల్ ఇంజినీర్ ప్రసాద్ తదితరులు పాల్గున్నారు.

# పలు గ్రామాల్లో ఇళ్ల పట్టాల పంపిణీ



**చిలకలూరిపేట. ప్రజాపాలన :** ప్రభుత్వం నిర్మిస్తున్నది కేవలం ఇళ్లు మాత్రమే కాదని, ఊళ్లు అని చిలకలూరిపేట శాసనసభ్యురాలు విడదల రజిని తెలిపారు. చిలకలూరిపేట రూరల్ మండలం వేలూరు, దండమూడి, గొట్టిపాడు గ్రామాల్లో మంగళవారం ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో చిలకలూరిపేట శాసనసభ్యురాలు విడదల రజిని ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విడదల రజిని మాట్లాడుతూ సీఎం వైఎస్ జగనన్న ప్రతిపక్షనాయకుడిగా 3,648 కి.మీ దూరం పాదయాత్ర చేశారని, సొంతిల్లు లేని వారి కష్టాలను ఆయన స్వయంగా చూశారని వివరించారు. 25 లక్షల ఇళ్లు కట్టి ఇస్తామని ఎన్నికల ప్రణాళికలో తాము చెప్పామని, కానీ ఈ రోజు దాదాపు 31 లక్షల మందికి ఇళ్ల స్థలాలు ఇవ్వడంతో పాటు, ఇళ్లు కూడా కట్టించి ఇస్తున్నామని వెల్లడించారు. దీనివల్ల మొత్తంగా 1.24 కోట్ల మందికి ప్రయోజనం కలుగుతుందని వివరించారు. ఒక రాష్ట్ర జనాభాతో ఇది సమానమని వెల్లడించారు. అంటే తాము కడుతున్ ఊళ్లు కాదని, ఒక రాష్ట్ర జనాభాకు సరిపడా ఊళ్లని చెప్పారు. ఇంకా ఎవరైనా అర్హులు మిగిలిపోతే దరఖాస్తు చేసుకుంటే 90 రోజుల్లో ఇంటి స్థలం ఇస్తామని వివ రించారు. గతంలోలా 224 చదరపు అడుగుల్లో కాకుండా, 340 చదరపు అడుగుల్లో తాము ఉచితంగా ఇళ్లు కట్టించి ఇవ్వబోతున్నామన్నారు.

**అక్కచెల్లెమ్మలకు అన్ని విధాలా అండగా**

అక్క చెల్లెమ్మలకు తమ ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటోందని ఎమ్మెల్యే విడదల రజిని తెలిపారు. అమ్మ ఒడి పథకం ద్వారా దాదాపు 43 లక్షల మంది అక్క చెల్లెమ్మలకు రూ.6,352 కోట్లు నేరుగా వారి బ్యాంకు ఖాతాలకే జమ చేశామని చెప్పారు. విద్యా దీవెన పథకం ద్వారా 18.52 లక్షల మంది అక్క చెల్లెమ్మలకు రూ.4 వేల కోట్లు ఇచ్చామని తెలిపారు. వసతి దీవెన కింద 15.56 లక్షల తల్లులకు రూ.1,221 కోట్లు ఇచ్చామని చెప్పారు. ఆసరా కింద పొదుపు సంఘాల అక్కచెల్లెమ్మలకు తొలి ఏడాదిలో 87.74 లక్షల మందికి రూ.6,792 కోట్లు ఇచ్చామని చెప్పారు. చేయూతలో వారి చేయి పట్టుకుని నడిపిస్తూ 24.55 లక్షల మంది అక్కచెల్లెమ్మలకు రూ. 4,604 కోట్లు చేతికి అందించామని తెలిపారు. పొదుపు సంఘాలకు సున్నా వడ్డీ పథకంలో 87 లక్షల మంది అక్క చెల్లెమ్మలకు రూ. 1,400 కోట్లు ఇచ్చామని వివరించారు. కాపు నేస్తం పథకంలో 3.28 లక్షల మంది అక్కచెల్లెమ్మలకు రూ. 492 కోట్లు ఇచ్చామని చెప్పారు.

**ఆయా గ్రామాల్లో ఇళ్ల పట్టాల పంపిణీ ఇలా**

తొలుత వేలూరు గ్రామంలో కార్యక్రమం జరిగింది. ఇక్కడ 87 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీచేశారు. ఈ గ్రామంలో ఇళ్ల పట్టాల పంపిణీ కోసం రూ.36.3లక్షలు ఖర్చు చేశామని చెప్పారు. కుక్కపల్లివారిపాలెం గ్రామానికి చెందిన 19 మంది లబ్ధిదారులకు అరెకరం స్థలాన్ని 8.5లక్షలకు సేకరించి ఇళ్ల స్థలాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. దండమూడి గ్రామానికి చెందిన 66 మందికి 2 లే అవుట్ల ద్వారా ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. వీరి కోసం రూ.35లక్షలు చెల్లించి 1.84 ఎకరాల భూమిని సేకరించామని వివరించారు. గొట్టిపాడు గ్రామంలో ఏకంగా 125 మంది లబ్ధిదారులకు 2 లేఅవుట్ల ద్వారా ఇళ్ల పట్టాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. 65.4లక్షలు వెచ్చించి ఈ గ్రామంలో మూడున్నర ఎకరాల భూమి సేకరించామని చెప్పారు. ఈ నాలుగు గ్రామాల్లో కలిపి మంగళవారం 297 మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. మొత్తం 6 లే అవుట్ల ను అభివృద్ధి చేశామన్నారు. మొత్తం మీద 7.66 ఎకరాల ప్రైవేటు స్థలాన్ని రూ.1.45 కోట్లు ఖర్చు చేసి సేకరించామని, ఈ రోజు లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల రూపంలో పంపిణీ చేశామని వివరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సుజాత,ఎంపీడీఓ హేమలత,చిలకలూరిపేట మండల స్పెషల్ ఆఫీసర్ మస్తాన్ షరీఫ్, హౌసింగ్ డీఈఈ వెంకటేశ్వర్లు,మార్కెట్ యార్డ్ చైర్మన్ బొల్లెద్దు చిన్న,చిలకలూరిపేట మండల అధ్యక్షుడు దేవినేని శంకరరావు, చిలకలూరిపేట పట్టణ అధ్యక్షుడు పఠాన్ తలహా ఖాన్,చిలకలూరిపేట మండల జడ్పీటీసీ అభ్యర్థి కోడె సుధారాణి,వేలూరు నాయకులు పఠాన్ దౌలత్ ఖాన్,గెరా మునలయ్య, బొంత నాగభూషణం, క్రిష్టపురపు శేఖర్,సింగం కృష్ణమోహన్, తుమ్మలగుంట రమేష్,చంటి, కుక్కపల్లివారిపాలెం నాయకులు కట్టా నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ సత్యం,దండమూడి,గొట్టిపాడు నాయకులు చప్పిడి బాలస్వామి, దండా నాగేశ్వరరావు,నాగభైరు శ్రీనివాసరావు, రావూరి శ్రీనివాసరావు, చేకూరి వెంకట రామయ్య, ఈవూరి సోంబాబు,శీలి నాగార్జున, తమ్ములూరి వీరయ్య,ఏసుబాబు, భాస్కరరావు, పసికర్ల బాబు,ఏసోబు మరియు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పరుగులు పెడుతున్న బంగారం

**ముంబై, డిసెంబర్ 29, (ప్రజాపాలన) :** రెండు రోజులుగా స్థిరంగా ఉంటూ వచ్చిన బంగారం ధర ఈరోజు పరుగులు పెట్టింది. పసిడి దూసుకెళ్తోంది. జిగేల్ మంటోంది. బంగారం ధర పెరిగితే.. వెండి రేటు కూడా ఇదే దారిలో పయనించింది. వెండి కూడా భారీగా పెరిగింది. గ్లోబల్ మార్కెట్‌లో పసిడి పెరగడం వల్ల దేశీ మార్కెట్‌లో కూడా ఇదే ట్రెండ్ కనిపించిందని బులియన్ మార్కెట్ నిపుణులు పేర్కొంటున్నారు. హైదరాబాద్ మార్కెట్‌లో మంగళవారం బంగారం ధర పైకి కదిలింది. 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.330 పెరిగింది. రూ.51,280కు చేరింది. అదేసమయంలో 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర కూడా ఇదే దారిలో నడిచింది. రూ.390 పెరుగుదలతో రూ.47,100కు ఎగసింది. బంగారం ధర పెరిగితే.. వెండి ధర కూడా ఇదే దారిలో పయనించింది. వెండి రేటు ఏకంగా రూ.1,400 పైకి చేరింది. దీంతో వెండి ధర రూ.72,600కు ఎగసింది. పరిశ్రమ యూనిట్లు, నాణేపు తయారీదారుల నుంచి డిమాండ్ పుంజుకోవడం ఇందుకు ప్రధాన కారణంగా చెప్పుకోవచ్చు. మరోవైపు అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ధర పెరిగింది. బంగారం ధర ఔన్స్‌కు 0.09 శాతం పెరుగుదలతో 1882 డాలర్లకు చేరింది. బంగారం ధర పెరిగితే వెండి ధర కూడా ఇదే దారిలో పయనించింది. వెండి ధర ఔన్స్‌కు 0.52 శాతం పెరుగుదలతో 26.68 డాలర్లకు ఎగసింది. ఇకపోతే బంగారం ధరపై ప్రభావం చూపే అంశాలు చాలానే ఉన్నాయి. ద్రవ్యోల్బణం, గ్లోబల్ మార్కెట్ పసిడి ధరల్లో మార్పు, కేంద్ర బ్యాంకుల వద్ద ఉన్న బంగారం నిల్వలు, వడ్డీ రేట్లు, జువెలరీ మార్కెట్, భౌగోళిక ఉద్రిక్తతలు, వాణిజ్య యుద్ధాలు వంటి పలు అంశాలు పసిడి ధరపై ప్రభావం చూపుతాయి.






# దేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ కార్యక్రమం ఇళ్ల పంపిణీ

## ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి

**నరసరావుపేట, ప్రజాపాలన :** నరసరావుపేట నియోజకవర్గంలో "నవరత్నాలు పేదలందరికి ఇళ్ళు" లో భాగంగా "వైస్సార్ జగనన్న ఇళ్ల పట్టాల పంపిణీ" కార్యక్రమంలో భాగంగా నరసరావుపేట మండలం ములకలూరు, కేతముక్కల అగ్రహారం గ్రామాల నందు 355 ఇళ్ల పట్టాలు పంపిణీ చేసిన నరసరావుపేట శాసనసభ్యులు డా.గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి . ఈ ఒక్క కార్యక్రమంతో చంద్రబాబు అరాచకపు ఆలోచనలకు చరమగీతం పాడుతున్నాం.వైసీపీ ప్రభుత్వం మహిళలకు అగ్రభాగం కల్పించింది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అక్కచెల్లెమ్మలకు సముచిత స్థానం కల్పించాలనే సంకల్పంతో.. ఎన్నో పథకాలను వారి చేతికే అందించారు. ఈ రోజు వారి పేరు మీదగా ఇళ్ల స్థలాల 'పట్టా' భిషేకం చేస్తున్నారు. ప్రభుత్వం తలపెట్టిన ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం.. రాష్ట్ర వ్యాప్తంగా ఇంత విజయవంతంగా జరగటంలో అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, ముఖ్యంగా వాలంటీర్ల పాత్ర అనిర్వచనీయం. పేదలకు పట్టాల పంపిణీ అనేది 50శాతం మేలు మాత్రమే, వారికి ఇళ్లు నిర్మించటంతోనే నూరు శాతం మేలు పూర్తవుతుంది. అందుకు జగనన్న ప్రభుత్వం కంకణబద్ధంగా పనిచేస్తోంది. అధికారులు పారదర్శకంగా, నిబద్ధతతో పనిచేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చరిత్రలో లేని విధంగా నేడు రాష్ట్ర వ్యాప్తంగా ఇళ్ళు లేని అక్క చెల్లెమ్మలు కు గ్రామీణ ప్రాంతాల్లో 1.5 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 1 సెంటు స్థలంలో ఇల్లు నిర్మించి ఇచ్చే బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టి దేశ వ్యాప్తంగా అతిరథమహారథులు అందరూ కూడా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ని అపర భగీరథుడుగా కీర్తిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చరిత్రలో నాడు వైయస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో 26 లక్షలు ఇందిరమ్మ ఇళ్ళు నిర్మించి పేదలకు అందించారు .అదే విదంగా తండ్రి అడుగుజాడల్లో నేడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ వై ఎస్ జగన్మోహన్ రెడ్డి దేశ చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో 30 లక్షల పై చిలుకు ఇళ్ళ పట్టాలు అక్క చెల్లెమ్మలకు అందించి చరిత్ర సృష్టించారు. ఈ నేపధ్యంలో నేడు నరసరావుపేట నియోజకవర్గ శాసనసభ్యులు ,ముఖ్యమంత్రి వై ఎస్ జగన్మోహన్ రెడ్డి కి అత్యంత విధేయులు అయిన డా.గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో నరసరావుపేట మండలం ములకలూరు గ్రామంలో 249, కేతముక్కల అగ్రహారంలో 106 ఇళ్ళ పట్టాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకి గ్రామ ప్రజలు పూలవర్షం కురిపించి, జేజేలు పలుకుతూ తమ స్వగ్రామానికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు డా.గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర ప్రజలకు సీఎం వైయెస్ జగన్మోహన్ రెడ్డి ఇళ్ల పట్టాల పంపిణి పండుగను కానుకగా ఇచ్చారు అని తెలియజేయటకు గర్విస్తున్నాం. అక్క ,చెల్లెమ్మలు పేరుతో 30 లక్షల పై చిలుకు ఇళ్ల పట్టాల పంపిణీ ద్వారా రాష్ట్ర చరిత్రలోనే ఒక సువర్ణధ్యాయాన్ని సృష్టించారని తెలిపారు. సంకల్ప బలం ముందు ఏ విద్రోహ శక్తి నిలవలేదు అనటా నికి నిలువెత్తు నిదర్శనమ్ ఈ ఇళ్ల పట్టాల పంపిణి అని తెలిపారు. చంద్రబాబు నాయుడు ఎన్ని కుయుక్తులు పన్నినా , తన అనుచరులతో ఎన్ని కేసులు పెట్టించిన అదరని, చెదరని చిరునవ్వుతో అన్నిటినీ ఎదుర్కొని మాట తప్పని, మడమ తిప్పని నేత గా నేడు ఈ బృహత్తర కార్యక్రమం ప్రారంభిస్తున్నాం. ములకలూరు గ్రామంలో అక్క చెల్లెమ్మలు పేరు మీద 249 ఇళ్ల పట్టాలు,కేత ముక్కల అగ్రహారం నందు 106 పట్టాల పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఇప్పుడు రానివారికి ,ఇల్లు లేనివారికి అప్లికేషన్ పెట్టుకోండి 90 రోజుల్లో మీకు ఇల్లు వచ్చేలా చర్యలు తీసుకుంటాం.ఎవరైనా స్థలం ఉంటే ఇల్లు కట్టుకోవటానికి ఆర్థిక సహాయం చేస్తాం, మమ్మల్ని కట్టి ఇవ్వమన్న కట్టిఇస్తాం ఏదైనా ఎంచుకునే అవకాశం మీకే ఇస్తున్నాం అని తెలిపారు. అధికారులు,ఎమ్మార్వో రమణా నాయక్,ఎండిఓ ,వైస్సార్సీపీ కార్యకర్తలు, మండల నాయకులు, గ్రామ వైసీపీ నాయకులు ,సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

## శతాధిక వృద్ధురాలు మృతి. ఎమ్మెల్యే కిలారి పరామర్శ



**పొన్నూరు, ప్రజాపాలన :** స్థానిక భావనగర్ కాలనీలో ఇటీవల శతాధిక వృద్ధురాలు తోట అనసూర్యమ్మ(104) మృతి చెందారు. ఆమె కుటుంబ సభ్యులను మంగళవారం పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య పరామర్శించారు. ఆమె కుమారుడు ప్రముఖ వ్యాపారి గాలింపు పత్రిక ఎడిటర్ తోట రాంబాబు ను కలిసి వివరాలు తెలుసుకున్నారు.ఆయన తన ప్రగాఢ సంతాప సానుభూతులు తెలిపారు.

## రైతులను బాధపెట్టిన ఏ ప్రభుత్వం మనుగడ కొనసాగించలేదు

### సిపిఐ నాయకులు వైదన వెంకట్



**నరసరావుపేట, ప్రజాపాలన :** స్థానిక నరసరావుపేటలో ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఢిల్లీలో జరుగుతున్న రైతులకు మద్దతుగా 4వ రోజు దీక్ష కొనసా గిస్తున్నారు ఈ దీక్షా శిబిరంలో సిపిఐ ఏరియా కార్యవర్గ సభ్యులు వైదన వెంకట్ మాట్లాడుతూ సుమారుగా 34 రోజుల నుంచి రైతులు " శాంతి యుతంగా నిరసనలు దీక్షలు కొనసాగిస్తున్నారు కేంద్ర ప్రభుత్వం ఒంటెద్దు పోకడ పోతుంది రైతులను బాధ పెట్టినా ఏ ప్రభుత్వం మనుగడ కొనసాగించలేదు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా కళ్ళు తెరిచి రైతులను తో చర్చలు జరపాలి నల్ల చట్టాలని రద్దు చేయాలి అని సి పి ఐ గా డిమాండ్ చేస్తున్నాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఏరియా కార్యదర్శి ఉప్పలపాటి రంగయ్య, ఏఐఎస్ఎఫ్ మేకల సంపత్ కుమార్ ,షేక్ సైదా తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ కార్యకర్తలపై దాడులను అడ్డుకోవాలి: చినరాజప్ప

రాజమండ్రి: సీటటఎం జగన్ అధికారంలోకి వచ్చాకా రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని మాజీమంత్రి, పెద్దాపురం ఎమ్మెల్యే చినరాజప్ప వ్యాఖ్యానించారు. ప్రొద్దుటూరులో టీడీపీ అధికార ప్రతినిధి సుబ్బయ్య హత్యను ఆయన ఖండించారు. రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో టీడీపీ కార్యకర్తలను హత్యలు చేసి, దాడులకు పాల్పడుతున్నప్పటికీ డీజీపీకి చీమకుట్టినట్టు కూడా లేదని మండిపడ్డారు. టీడీపీ కార్యకర్తలపై దాడులను అడ్డుకోవాలని పలుమార్లు ముఖ్యమంత్రికి, డీజీపీకి లేఖలు రాసినప్పటికి దున్నపోతు మీద వాన పడట్టు వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. ఇప్పటికైనా టీడీపీ



కార్యకర్తలపై దాడులను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని చినరాజప్ప డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉందన్నారు. రైతులకిచ్చిన హామీలను ప్రభుత్వం తుంగలో తొక్కిందన్నారు. రైతు సమస్యలను పరిష్కరించాలని సామర్లకోట తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. వరదలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని చినరాజప్ప డిమాండ్ చేశారు

## రాముడి విగ్రహం ధ్వంసం ఘటనపై మంత్రి వెల్లంపల్లి సీరియస్

విజయనగరం: విజయనగరం జిల్లా రామతీర్థం కొండపై రాముడి విగ్రహం ధ్వంసం ఘటనపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి వెల్లంపల్లి సీరియస్ అయ్యారు. రాముడి విగ్రహం ఘటనపై జిల్లా ఎస్పీతో మంత్రి వెల్లంపల్లి ఫోన్లో మాట్లాడారు. ఈ ఘటనపై విచారణను వేగవంతం చేయాలని, దోషులను కఠినంగా శిక్షించాలని మంత్రి ఆదేశించారు. విచారణ కోసం రీజనల్ జాయింట్ కమిషనర్ స్థాయి అధికారిని నియమించాలని దేవాదాయ ప్రత్యేక కమిషనర్‌కు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. విచారణ అధికారిగా డి.భ్రమరాంబను నియమించారు.



## ఐక్యవేదిక వినుకొండ పట్టణ మహిళా అధ్యక్షురాలుగా ఝాన్సీలక్ష్మి



**వినుకొండ. ప్రజాపాలన :** వినుకొండ కు చెందిన ఝాన్సీ లక్ష్మిని ఎస్సీ ఎస్టీ బీసీ ముస్లిం మైనారిటి జాతీయ ఐక్యవేదిక వినుకొండ పట్టణ అధ్యక్షులు గా ఏక గ్రీవాం గా ఎన్నిక చేసిన ట్లు డాక్టర్ పొనుగుపాటి పూర్ణచంద్రరావు ఎస్సీ ఎస్టీ బీసీ ముస్లిం మైనారిటీ జాతీయ ఐక్యవేదిక అధ్యక్షులు తెలిపారు.

## రోడ్లు డ్రెయిన్లుకు శంకుస్థాపన



**పొన్నూరు, ప్రజాపాలన :** స్థానిక ఈద్ గా రోడ్డులోని వివిధ వార్డుల్లో నూతన సిమెంట్ రోడ్లు డ్రెయిన్లు కు పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య మంగళవారం శంఖుస్థాపన చేశారు. 23,25, 27,28,29 వార్డుల్లో 14వ ఆర్థిక సంఘ నిధులు రూ. 2.17 కోట్లతో ప్రజాసమస్యల శాశ్వత పరిష్కారం కోసం అవసరమైన ప్రతిచోటా రోడ్డు డ్రెయిన్లు నిర్మాణం జరుగుతోందని ఎమ్మెల్యే కిలారి పేర్కొన్నారు. అనంతరం అబ్దుల్ కలాం బస్ షెల్టర్ లో నూతనంగా నిర్మించిన ఎల్ ఇ డి స్క్రీన్ ప్రారంభోత్సవం జరిపారు. ఆయా కార్యక్రమాలలో మున్సిపల్ కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు, వ్యవసాయ మార్కెట్ యార్డు అధ్యక్ష ఉపాధ్యక్షులు బోనిగల వేణుప్రసాద్, భవనం శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ ఎన్. రూత్ రాణి,రాష్ట్ర షేక్ కార్పొరేషన్ చైర్మన్ షేక్ యాసిన్, బొద్దులూరి రంగారావు, అంకినీడు చౌదరి, ఆకుల వెంకటేశ్వరరావు, బోయిన శివనాగరాజు, షేక్ షర్మిల, అనిల్ కుమారి,గెరా కుమారి, షేక్.జానీ బాష ,సుబాని నాజర్ తదితరులు పాల్గొన్నారు.

# అచ్చంపేట మండలంలో ఇళ్ళ పట్టాల పండుగ

**అచ్చంపేట .ప్రజాపాలన :** పెదకూరపాడు నియోజకవర్గం, అచ్చంపేట మండలంలోని పలు గ్రామాల్లో పండగలా ఇళ్ళ స్థలాల పట్టాలను పంపిణీ కార్యక్రమం జరిగింది. కస్తల గ్రామం - 101మందికి, కోనూర్ - 171 మందికి, ఓర్వకల్లు - 55 మందికి, రుద్రవరం - 53 మందికి, అంబడిపుడి - 37 మందికి, కోగంటి వారి పాలెం - 76 మందికి, చిగురుపాడు -152 మందికి, అచ్చం పేట టౌన్ - 814, గ్రందసిరి - 50 మందికి ఎంపీ, ఎమ్మెల్యే లు అందించారు. ఈ సందర్భంగా ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు , ఎమ్మెల్యే నంబూరు శంకర రావు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఇల్లు లేని పేద అక్క చెల్లెమ్మ లకు రాష్ట్ర వ్యాప్తంగా 30.75లక్షల ఇళ్ళ స్థలాలు అందించి, ఇల్లు కట్టించి ఇస్తున్నారు. ఇంటి బాధ్యతను సక్రమంగా నిర్వర్తించే మహిళ చేతుల్లోనే ఈ రోజు ఇళ్ల పట్టాలను ఉంచుతూ.. వారికి ఆస్తిని ఇస్తున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక అన్ని విధాలుగా సింహభాగం కల్పించి ఎన్నో పథకాలు అందిస్తున్నారు. ఇల్లు లేని వారు రాష్ట్రంలో ఎవరు ఉండకూడదనేది సీఎం ఆశయం. సెల్ ఫోన్ లేని వారంటూ ఎవరూ ఉండరు, కానీ ఇల్లు లేని నిరుపేదలు ఉంటున్నారు. సాంకేతికంగా మనం ఎంతో అభివృద్ధి చెందుతూ ఉన్న ఈ కాలంలో కూడా ఇల్లు లేని ఉండటం అనేది ఎంతో విచారకరం. 3,648 కి.మీ సుదీర్ఘ పాదయాత్రలో జగన్ గారు ఎందరో బాధలు విన్నారు. ఆ పరిస్థితులు మారుస్తూ..పేదలకు ఇల్లు కల సాకారం చేస్తున్నారు. అర్హులుగా ఉండి లబ్ధి జరగకుంటే.. అర్జీ చేసుకుంటే.. 90రోజుల్లో పరిష్కారం అవుతుంది. లబ్ధిదారులందరికీ ఎంపీ, ఎమ్మెల్యే లు స్వయంగా అందరికీ ఇళ్ళ పట్టాలను అందించారు. ఇళ్లకు భూమి పూజ చేసారు. అర్హులందికీ ఇల్లు పట్టా అందాలని.. రాని వారికి వెంటనే ఇల్లు వచ్చేలా చర్యలు తక్షణమే చేపట్టాలని అధికారులను ఆదేశించారు.






# ముందు చూపు లేక.. అటకెక్కిన కెనాల్

**కాకినాడ, డిసెంబర్ 29, (ప్రజాపాలన) :** మానవ నాగరకత ప్రపంచంలో ఎక్కడ పుట్టిందన్న దానిపై భిన్నాభిప్రాయాలున్నా.... అభివృద్ధి విషయంలో భేదాభిప్రాయాలు లేవు. పురాతన నాగరికత నదీ తీరాల్లో మొదలయ్యి... సముద్ర తీరాల్లో వీరాజిల్లిందన్నది అందరూ అంగీకరించే చారిత్రక వాస్తవం. ఆదిమానవుడి నుండి నేటి ఆధునిక మనిషి వరకు ప్రతి విషయం జలంతోనే ముడిపడి ఉంది. యూరఫ్, పశ్చిమ దేశాల నావికాయాత్రికులు తూర్పు తీరాలకు ప్రయాణించి ఎన్నో దేశాలను కనుగొని... వ్యాపార సంబంధాలను మెరుగుపర్చారు. శతాబ్దాల నాటి కాలువకు పూర్వవైభవం తెచ్చేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తుంది. జలయానాలు ప్రపంచ గతిని మార్చాయి. చరిత్రను కొత్తపుంతలు తొక్కించాయి. అందుకే తొలి నాగరికతల విలీనం జల మార్గాలతోనే జరిగిందన్నది కాదనలేని నిజం. తూర్పుగోదావరి జిల్లా కాకినాడ నుంచి చెన్నై వరకు మన రాష్ట్రంలోనూ జలరవాణా బాగా కొనసాగింది. 19వ శతాబ్దంలో బకింగ్



హామ్ కెనాల్‌కు శ్రీకారం చుట్టగా...20 వ శతాబ్దానికి ముందు చూపులేని పాలకుల కారణంగా కనుమరుగయ్యింది. గుడ్డిలో మెల్లలా మళ్లీ కేంద్ర ప్రభుత్వం ఈ జల రవాణా మార్గాన్ని పునరుద్ధరించాలని, విస్తరించాలని తలంచింది. ప్రస్తుత తరుణంలో దాని పునరుద్ధరణ సాధ్యమేనాఅన్న దానిపై భిన్నవాదనలు వినిపిస్తున్నాయి. దేశాన్ని దోచుకున్నా బ్రిటిష్ వారు కొన్ని చారిత్రక మేళ్లు సైతం చేశారు. ఓడరేవులు, రైల్వేలు, బ్రిడ్జిలు, నదులపై ఆనకట్టలు, అంతర్గత జలరవాణా వ్యవస్థలు తెల్లదొరలు ఇచ్చిన వరాలే. ఏ సాంకేతికత పరిజ్ఞానం లేని రోజుల్లో బ్రిటిష్ వారు చేసిన కొన్ని మహత్తర ప్రాజెక్టులు. 65 ఏళ్ల కాలంలో అలాంటి నిర్మించకపోగా... నిర్వీర్యం అవుతున్నాయి. కాలగర్భంలో కలిసిపోయిన దానిలో ఈ బకింగ్ హామ్ కెనాల్ ఒకటి. మురుగు నీరు సముద్రంలోకి పంపడం, మరికొన్ని నదీ పయనించేలా.... గొప్ప అంతర్గత జల రవాణా వ్యవస్థ "బకింగ్ హామ్ జలరవాణా మార్గం." మద్రాస్ నుండి కాకినాడ వరకూ సముద్రానికి సమాంతరంగా, ప్రజల అవసరాలకు దగ్గరగా నిర్మించిన రవాణా సౌకర్యం. దక్షిణ భారత దేశంలో వచ్చిన తీవ్ర కరువు కాటకాలను ఎదుర్కొనడానికి ఎంతో ఉపయోగపడింది జలమార్గం. మద్రాస్ నుండి నేటి ప్రకాశం జిల్లా పెదగంజాం వరకూ కేవలం ఆయా ప్రాంతాల్లో మురుగునీరు, వరద నీరును సముద్రానికి చేర్చేందుకు నిర్మించబడింది ఈ కాలువ. సముద్రపు ఆటుపోట్ల ఉప్పునీళ్లు, మురుగునీళ్లు తప్పా మంచినీటి ఎరుగని కాలువ. దీనికి అనుసంధానంగా.... అక్కడక్కడా టెర్మినల్స్, నీటి రెగ్యులేటర్లు నిర్మించి.. అద్భుతమైన జల రవాణా మార్గంగా తీర్చి దిద్దారు బ్రిటిష్ వారు. బకింగ్ హామ్ అనే వైస్రాయ్ హయాంలో 1806లో ఇది నిర్మితమవడంతో దీనికి ఆ పేరు వచ్చింది. తరవాతి కాలంలో క్రిష్ణానదిపై బ్యారేజ్, గోదావరిపై ధవళేశ్వరం ఆనకట్ట కట్టడంతో.... ఏలూరు మీదుగా రాజమండ్రి– కాకినాడలకు పొడిగించారు. బకింగ్ హామ్ కెనాల్ కాటన్ నిర్మించిన నీటి పారుదల వ్యవస్థ, జల రవాణాను పరిశీలిస్తే అబ్బుర పరుస్తాయి. బీడు భూములకు నీటి పారుదలతో పాటు ఒక చక్కని ట్రాన్స్ పోర్టు సిస్టంను అభివృద్ధి పరిచారు. నేటి పాలకులు లక్షల కోట్ల రూపాయలతో నిర్మిస్తున్న ఏ ప్రాజెక్టులోనూ ఈ సదుపాయాలు కనిపించవు. రోడ్డు, రైలు మార్గం కంటే జల మార్గం తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు... పొందే మార్గం ఉండటంతో ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేస్తుంది. బకింగ్ హామ్ కాలువ ఏర్పడిన తొలినాళ్లలో ఆయిల్ ఇంజన్లు లేవు. ప్రవాహానికి దిగువకు వెళుతుంటే... తెరచాప, పొడవాటి వెదురు ఉపయోగించి పడవ ఒడ్డుకు తాకకుండా తాళ్లతో లాక్కుంటూ నడిచేవారు. ఏలూరు, విజయవాడ ప్రకాశం బ్యారేజ్ మీదుగా కొమ్మమూరు కాల్వ ద్వారా పెదగంజాం చేరుకునేవారు. అక్కడి నుండి మద్రాస్ సెంట్రల్ స్టేషన్, మరక్కానమ్ వరకూ ఈ కాలువ విస్తరించి ఉంది. అప్పటి నిర్మాణాలు, గేట్లు, తూములు నేటికీ చెక్కు చెదరకుండా ఉన్నాయి. చిన్నప్పుడు చూసిన జలరవాణా తిరిగి ప్రారంభమవుతుందంటే ...చాలా మంది సంబరపడుతున్నారు. పర్యావరణ రహితంగా పల్లెలు, పట్టణాలు, నగరాలు ఎంతో అభివృద్ధి చెందుతాయని చెబుతున్నారు.నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, కృష్ణా, ఉభయగోదావరి జిల్లాల ప్రజల జీవన విధానం మొత్తం ఈ బకింగ్ హామ్ కాలువతోనే ముడిపడి ఉండేది. రైల్వేలు, మోటారు వాహనాలు అభివృద్ధి చెందడంతో దీని ప్రాధాన్యత తగ్గుతూ వచ్చింది. అప్పట్లో ఇంధన రేట్లు చవగ్గా ఉండడం, వేగంగా రవాణా కావటంతో రైల్వే, రోడ్డు మార్గాలు డెవలప్ అయ్యాయి. 1965 లో వచ్చిన దివిసీమ ఉప్పెనతో జల రవాణా మార్గం దెబ్బ తింది. 1976 లో వచ్చిన మరో తుఫాన్‌తో రవాణా నిలిచిపోయింది. మన దేశంలోని బ్రిటిష్ వారు అభివృద్ధిచేసిన మూడు అతి పెద్ద అంతర్గత జలరవాణా మార్గాల్లో ఇది ఒకటి. మరల కేంద్రం దృష్టి సారించినప్పటికీ చిత్తశుద్ధితో పునరుద్దరిస్తే.... బాగుంటుందన్నారు స్థానికులు. బకింగ్ హామ్ కాలువ పునరుద్దణ జరిగితే కోస్తా తీరంలో పర్యాటకం మరింత ఊపందుకుంటుంది. కాకినాడ తీరంలో ఉన్న మడ అడవులు, కోనసీమ అందాలు, వంపులు తిరిగిన గోదావరి పాయలు ప్రకృతి వరప్రసాదంగా నిలిచిన పాపి కొండల బోట్ షికార్ మరింత విస్తృతమవుతుంది. అయితే కాలువ పునరుద్దరణకు అనేక అడ్డంకులు మాత్రం ఉన్నాయి. కొన్ని ప్రాంతాల్లో జలమార్గం కనుమరుగుకాగా మరికొన్నిచోట్ల అక్రమణాలకు గురయింది. వీటిని తొలగించాలంటే ఖర్చుతో కూడుకున్న పనితోపాటు ఆక్రమణదారుల ఒత్తిడి ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. కొత్త ప్రతిపాదిత జాతీయ అంతర్గత జలరవాణా మార్గం మూడు దశల్లో 1028 కిలోమీటర్లు పొడిగించాలని కేంద్రం ఆలోచిస్తుంది. ప్రస్తుతం రెండు వేల కోట్ల పైగా నిధులు దీనికి అవసరం. నేరుగా నిధులు కేటాయించే కంటే ..ప్రయివేటు భాగస్వామ్యంలో పిపిపి పద్దతిలో చేపట్టాలని యోచిస్తుంది ప్రభుత్వం. కానీ మురుగునీరు సముద్రంలోకి పోవాల్సిన చోట కాలువ కుచించుకుపోయింది. మిగిలిన చోట ఆక్రమణలకు గురి అయింది. చెన్నై నగరంలో యాభై కిలోమీటర్ల మేర బైపాస్ నిర్మిచుకోవాల్సిన పరిస్థితి. ది చెన్నై మాస్ రాపిడ్ ట్రాన్స్ పోర్టు సిస్టం నిర్మాణాలు బకింగ్ హామ్ కాలువలోనే ఉన్నాయి. వీటిని ఇప్పుడు మార్చడం సాధ్యం కానిపనిగా విశ్లేషకులు భావిస్తున్నారు

# కాపాడిన కరోనా.. ఇప్పుడు ఇబ్బంది

విజయవాడ, డిసెంబర్ 29, (ప్రజాపాలన) : స్థానిక సంస్థల ఎన్నికలను జరపాలని రాష్ట్ర ఎన్నికల అధికారి నిమ్మగడ్డ రమేష్ కుమార్ ప్రయత్నాలు ముమ్మరం చేశారు. అయితే రెండో రకం కరోనా వైరస్ రావడంతో ఇప్పుడు ప్రభుత్వానికి ఎన్నికల వాయిదాకు అవకాశం చిక్కినట్లయింది. బ్రిటన్, ఇటలీలో రెండో రకం కరోనా వైరస్ రావడం, ప్రపంచ దేశాలన్నీ వణికిపోతుండటం అందరికీ తెలిసిందే. అయితే ఈ సమయంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ సాధ్యం అయ్యే అవకాశం కన్పించడం లేదు.నిమ్మగడ్డ రమేష్ కుమార్ ఆంధ్రప్రదేశ్ లో స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని గట్టిగానే ప్రయత్నిస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం సహకరించడం లేదని గవర్నర్ కు ఫిర్యాదు చేశారు. హైకోర్టును కూడా ఆయన ఆశ్రయించారు. తాను మార్చిలో పదవీ విరమణ చేస్తున్నందున ఫిబ్రవరి నెలలోనే ఎన్నికలను నిర్వహించాలని నిమ్మగడ్డ రమేష్ కుమార్ అనుకుంటున్నా కరోనా ఆయనను ముందు అడుగు వేయనీయడం లేదు.స్థానిక సంస్థల ఎన్నికలను నిమ్మగడ్డ రమేష్ కుమార్ కుమార్ కరోనా కారణంగానే వాయిదా వేశారు. అయితే అప్పట్లో కేవలం రెండు, మూడు కేసులే ఉన్నప్పటికీ కరోనాను సాకుగా చూపి వాయిదా వేశారు. ప్రభుత్వంతో ఏమాత్రం సంప్రదించకుండా వాయిదా వేయడంతో జగన్ సర్కార్ దీనిపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ప్రభుత్వానికి, నిమ్మగడ్డ రమేష్ కుమార్ కు మధ్య ఆరు నెలల నుంచి యుద్ధం కొనసాగుతూనే ఉంది.ప్రభుత్వం మాత్రం కరోనా వైరస్ ఉధృతి తీవ్రంగా ఉందని తాము ఎన్నికలను నిర్వహణకు ముందుకు రాలేమని పదే పదే చెబుతుంది. అయినా నిమ్మగడ్డ రమేష్ కుమార్ మాత్రం రాజ్యాంగపరంగా ఎన్నికలను నిర్వహించాల్సిందేనని పట్టుబడుతున్నారు. కానీ తాజాగా కొత్తరకం కరోనా వైరస్ రావడంతో నిమ్మగడ్డ రమేష్ కుమార్ వాదన ఇక బలహీనమయిందనే చెప్పాలి. ఇప్పుడు ఆయన న్యాయస్థానాలను ఆశ్రయించినా ఫలితం ఉండకపోవచ్చు. నిమ్మగడ్డ రమేష్ కుమార్ ఎన్నికల నిర్వహణలో ఫెయిల్ అవ్వక తప్పదన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి.

## ఆమంచిని టార్గెట్ చేసిన టీడీపీ

**ఒంగోలు, డిసెంబర్ 29, (ప్రజాపాలన) :** ప్రకాశం జిల్లా చీరాల నియోజకవర్గంలో ప్రజల మనసు దోచుకున్న నాయకుడిగా.. అభివృద్ధికి కేరాఫ్‌గా మారారంటూ యువ నాయకుడు ఆమంచికి మంచి ఇమేజ్ ఉంది. ఆయన రెండు సార్లు వరుసగా ఎమ్మెల్యేగా గెలవడం ఒక ఎత్తు అయితే? 2014లో ఏ పార్టీ సపోర్ట్ లేకుండా ఇండిపెండెంట్‌గా పోటీ చేసి కాంగ్రెస్, టీడీపీని ఓడించడం మరో ట్విస్టు. అయితే.. గత ఏడాది ఎన్నికల్లో టీడీపీ తరఫున పోటీ చేసిన కరణం బలరాం విజయం సాధించారు. దీంతో ఇరు పక్షాల మధ్య సహజంగానే రాజకీయ వైరం ఉంటుంది. ఇదిలావుంటే.. కొన్నాళ్ల కిందట తన కుమారుడి భవిష్యత్తు కోసం.. కరణం.. వైసీపీ పంచన చేరారు. వాస్తవానికి అప్పటికే వైసీపీలో ఉన్న ఆమంచితో ఆయన కలిసి పోవడమో.. లేక డిస్టెన్స్ మెయింటెన్ చేసినా? వివాదాలకు దూరంగా ఉండడమో చేయాలి. కానీ.. వచ్చే ఎన్నికల్లోనూ తనకే టికెట్ ఇవ్వాలని.. ఇప్పటి నుంచి అంటే.. మూడున్నరేళ్ల ముందు నుంచే కరణం.. తన అనుకూల వర్గంతో ప్రచారం చేయిస్తున్నారు. ఇక, అదే సమయంలో చేనేత సామాజిక వర్గానికి చెందిన పోతుల సునీత.. తనను నెత్తిన పెట్టుకుని టికెట్ ఇచ్చి.. ఓడిపోతే.. ఎమ్మెల్సీని చేసిన టీడీపీకి నమ్మక ద్రోహం చేసి.. వైసీపీ పంచన చేరిపోయారన్న విమర్శలు మూటకట్టుకున్నారు. ఆమె ఏ కరణంను అయితే నమ్మి వైసీపీలోకి వచ్చారో ఇప్పుడు అదే కరణం ఆమెను రాజకీయంగా అణగదొక్కే ప్రయత్నాలు చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. అటు కరణం బలరాం.. కానీ, ఇటు పోతుల సునీత కానీ.. ఇద్దరి లక్ష్యం చీరాల టికెట్‌ను సంపాయించుకోవడమే. ఈ క్రమంలో ఇప్పుడు ఈ నేతల టార్గెట్ కూడా ఆమంచి కృష్ణమోహనే. అందుకే.. ఇరువర్గాలు ఎప్పుడు ఎక్కడ అవకాశం వచ్చినా.. ఆమంచిని టార్గెట్ చేస్తూ వచ్చాయి. అయితే ఇప్పుడు చీరాల రాజకీయం రివర్స్ అయ్యి మొదటికే మోసం వచ్చింది. టీడీపీలో జట్టుకట్టి ఆమంచిని ఓడించి.. ఇప్పుడు వైసీపీలోనూ ఆమంచి టార్గెట్‌గా వీరు చేసిన రాజకీయం వికటించి.. వీళ్లలో వీళ్లు తన్నుకునే వరకు వచ్చింది. ఇక ఆమంచి విషయానికి వస్తే గత పదేళ్లు ఎమ్మెల్యేగా ఉన్నా.. గత ఎన్నికల్లో ఓటమి తర్వాత అయినా.. ప్రజలకు ఆయన చేరువగానే ఉన్నారు. ఇటీవల మత్స్యకార వివాదమే దీనికి ప్రధాన ఉదాహరణ. ఇక, పేదలకు ఇళ్ల లబ్ధిని చేకూర్చేందుకు తన వంతుగా ఆమంచి ఎంతో ప్రయత్నం చేశారు.

## రాజధానిపై జగన్ ఆలోచన ఇదేనా?



**విజయవాడ, డిసెంబర్ 28, (ప్రజాపాలన) :** ఏపీలో చూస్తే రోజు రోజుకూ అమరావతి రాజధాని ఆశలు అడుగంటిపోతున్నాయి. విపక్షాలు అన్నీ కూడా ఏకకంఠంతో అమరావతే మన ఒకే ఒక రాజధాని అంటే అనవచ్చు కాక. కానీ 151 సీట్ల బంపర్ మెజారిటీతో అధికారంలోకి వచ్చిన బలమైన ముఖ్య మంత్రి జగన్ మాత్రం ససేమిరా అనే అంటున్నారు. ఆయన ఎపుడూ ఈ విషయాల గురించి మాట్లాడరు, సమయం సందర్భం వచ్చినపుడు కొన్ని హింట్లు ఇస్తారంటే. దానికి బట్టి అర్థాలు పరమార్థాలూ వెతుక్కోవాల్సిందే. అమరావతి రాజధాని అని ఒకటి ఇప్పటికే ఉంది కదా. దానికి మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్మాణశిల్పిగా ఉన్నారు కదా అని ఎవరైనా అనుకుంటే ఇప్పటికీ పప్పులో అలా కాలు వేసి ఉంచేసినట్లే. జగన్ కి అమరావతి రాజధాని అన్నది ఇష్టం ఉందా లేదా అన్నది పక్కన పెడితే ఆయన మనసులోని ఆలోచనలకు మాత్రం అది అద్దం పట్టేలా లేదు అన్నది కచ్చితంగా జగన్ మాటల ద్వారానే తెలుస్తోంది. అదెలా అంటే ఇళ్ళ పట్టాల పంపిణీ సభలో జగన్ చేసిన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనంగా చూడాలి. కులమత వర్గ వర్ణాలకు తావు లేని రాజధానిని మనం నిర్మించుకుందామని కాకినాడ సభలో జగన్ పిలుపు ఇచ్చారు. మరి దీని సందేశం ఏంటి మహానుభావా అంటే చాలానే ఉంది అనే చెప్పాలిపుడు.రాజధాని అంటే ఏమిటి అని ఎవరినైనా అడిగితే ఒక రాష్ట్రానికి ముఖ్య పట్టణం అని చెబుతారు. కానీ జగన్ ని అడిగితే ఆయన ఇలా చెబుతారు. అన్ని వర్గాల ప్రజలు హాయిగా కలసి ఉండేదే అసలైన రాజధాని అని కూడా అంటారు. మరి జగన్ చెప్పిన పద్ధతిలో చూస్తే అమరావతి అందరి రాజధాని అవునా కాదా అన్నదాని మీద ఎవరి మటుకు వారికే సమాధానం దొరుకుతుంది. అమరావతిలో ఒక సామాజికవర్గం వారే పెద్ద ఎత్తున ఉన్నారంటూ వైసీపీ నేతలు తరచుగా చేసే విమర్శలు చూసినా, అక్కడ యాభై వేల మంది ఎస్సీలకు ఇళ్ళ స్థలాలు ఇవ్వవద్దు అంటూ ఒక సామాజిక వర్గం కోర్టుకు వెళ్ళిన సందర్భాన్ని చూసినా జగన్ ఎందుకు ఈ మాటలు అన్నారో ఇట్టే అర్థమవుతుంది. మూడు రాజధానులు అని ఇంతదాకా జగన్ అంటూ వచ్చారు. ఇపుడు అది హై కోర్టులో విచారణ దశలో ఉంది. మరో వైపు అమరావతిని ఏకైక రాజధానిగా వైసీపీ సర్కార్ ఉన్నంతవరకూ జగన్ సీఎంగా ఉన్నంతవరకూ అసలు ఒప్పుకోరు అని కచ్చితంగా చెప్పవచ్చు. మరి అన్నిటికీ అతీతమైన అన్ని వర్గాలతో కూడిన సమాజంతో కూడిన రాజధానిని నిర్మించుకుందామని జగన్ అనడమే అమరావతికి అసలైన బిగ్ ట్విస్ట్. అమరావతి రాజధానిగా వైసీపీ ఒప్పుకోవాలంటే అక్కడ భూముల మీద విచారణ జరిపించి అన్ని వర్గాలకు అక్కడ నివాస యోగ్యం కల్పించేలా చూడడం ఒక ఆప్షన్. అది జరగదు అనుకుంటే మూడు రాజధానుల ప్రతిపాదనతో ముందుకు సాగుతూ విశాఖ లాంటి చోట మరో రాజధానిని కొత్తగా నిర్మించడం ఇంకో ఆప్షన్. మరి జగన్ మనసులో ఏముందో. ఎందుకు ఇలా అన్నారో కొద్ది రోజులు ఆగితే అపుడే తెలుస్తుంది.

# సింహపురిలో తమ్ముళ్ల తన్నులాటలు

**నెల్లూరు, డిసెంబర్ 28, (ప్రజాపాలన) :** నెల్లూరు టీడీపీలో చిత్రమైన పరిస్థితి తెరమీదికి వచ్చింది. ఇక్కడ నేతలు ఉన్నదే తక్కువ. వారిలోనూ ఆధిపత్య పోరు కొన్నాళ్లుగా సాగుతోంది. నువ్వు నాకు చెప్పేది ఏంటి ? అని నేతలు ఒకరిపై ఒకరు గుస్సాగా ఉన్నారు. మరికొందరు.. ప్రజల్లో గెలవడం చేతకాని వాళ్లు కూడా మాపై పెత్తనం చెలాయిస్తున్నారంటూ.. ఓ మాజీ మంత్రిని ఉద్దేశించి ఘాటుగా చేసిన వ్యాఖ్యలు.. అధినేత చంద్రబాబు వరక కూడా చేరాయి. దీంతో నెల్లూరులో టీడీపీ బతికి బట్టకడుతుందా? అనేది సందేహంగా ఉంది. గత ఏడాది ఎన్నికల్లో నెల్లూరు జిల్లాను వైసీపీ క్లీన్ స్వీప్ చేసేసింది. ఆ తర్వాత కూడా బీద మస్తాన్‌రావు లాంటి నేతలు వైసీపీలోకి వెళ్లిపోయారు. దీనికితోడు.. బలమైన రెడ్డి సామాజిక వర్గానికి చెందిన ఇద్దరు నేతలు ఎన్నికలకు ముందు వైసీపీలోకి చేరిపోయారు. తర్వాత బీసీ వర్గానికి చెందిన పలువురు జిల్లా స్థాయి నేతలు కూడా వైసీపీ బాట పట్టారు. బీద పార్టీ మారిపోయాక ఆయన సోదరుడు రవిచంద్ర యాదవ్ ఉన్నా పార్టీలో కీలక పదవిని కట్టబెట్టినా.. ఎవరితోనూ ఆయన కలుపుకొని ముందుకు సాగడం లేదు. ఇక, నెల్లూరు రూరల్ నుంచి పోటీ చేసి ఓడిపోయిన మైనార్టీ వర్గానికి చెందిన అజీజ్ నెల్లూరు పార్లమెంటరీ పార్టీ అధ్యక్షుడు అయ్యాక అన్నీ తానే అయి వ్యవహరించడం.. జిల్లాకు చెందిన నాయకులకు మింగుడు పడడం లేదు. పోనీ.. నేరుగా వ్యతిరేకిద్దామా ? అంటే.. అధినేత వద్ద మంచి మార్కులు ఉన్నాయి.

మరోవైపు మాజీ మంత్రి, ఐదుసార్లు ఓడిపోయిన సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పార్టీని గాడిలో పెట్టే ప్రయత్నం చేస్తున్నా ఆయన మాట ఎవరూ పట్టించుకోవ డం లేదు. జిల్లా టీడీపీలో రెడ్డి సామాజిక వర్గం ఆధిపత్యం తగ్గుతూ వస్తోంది. బీసీ నేతగా ఉన్న రవిచంద్ర యాదవ్ తన సామాజిక వర్గంతో పాటు బీసీలను ఎంకరేజ్ చేస్తుండడంతో పార్టీలో అరకొరాగా ఉన్న రెడ్లకు నచ్చడం లేదు. దీనికి తోడు చంద్రబాబు మైనార్టీ వర్గానికి చెందిన అజీజ్‌కు పార్లమెంటరీ పార్టీ పగ్గాలు ఇవ్వడంతో బీసీ, రెడ్లకు నచ్చని పరిస్థితి.టీడీపీ పరిస్థితి నానాటికీ తీసికట్టుగా ఉందనే ప్రచారం జరుగుతోంది. చిత్రమైన పరిస్థితి ఏంటంటే రెడ్డి సామాజిక వర్గానికి చెందిన అతి స్వల్ప సంఖ్యలో ఉన్న టీడీపీ నేతలు వైసీపీకి లోపాయికారీగా సహకరిస్తూ తమ పనులు చేయించుకుం టున్నారు. దీంతో టీడీపీ జెండా ఎక్కడా కనిపించడం లేదు. ఇక, నెల్లూరు సిటీకే చెందిన మరో మాజీ మంత్రి పొంగూరు నారాయ ణ ఎన్నికల తర్వాత ఎక్కడ ఉన్నారో.. కూడా తెలియడం లేదు. దీంతో టీడీపీ పరిస్థితి ఒక అడుగు ముందుకు పది అడుగులు వెనక్కి చందంగా మారింది. ఇప్పుడున్న పరిస్థితుల్లో నెల్లూరులో పార్టీని గాడిలో పెట్టడం చంద్రబాబుకు సాధ్యమయ్యేలా లేదు.

# సాఫ్ట్‌వేర్ నుంచి పాలిటిక్స్‌లోకి...

**విశాఖపట్టణం, డిసెంబర్ 28, (ప్రజాపాలన) :** ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఎంతో పేరు పడిన రాజకీయ కుటుంబం ద్రోణంరాజు సత్యనారాయణది. విశాఖ జిల్లాలోని జుత్తాడ కరణంగా తన వృత్తిని మొదలుపెట్టిన ద్రోణంరాజు దేశ అత్యున్నత చట్ట సభ అయిన పార్లమెంట్‌లో మెంబర్ కావడం అంటే అది అతని చాణక్య రాజకీయంగానే చూడాలి. లోక్ సభ, రాజ్యసభల్లో రెండు దశాబ్దాలకు పైగా సభ్యునిగా కొనసాగిన ద్రోణంరాజు ఒక దశలో జాతీయ రాజకీయాల్లోనూ చక్రం తిప్పారు. ఆయన వారసుడిగా వచ్చిన కుమారుడు శ్రీనివాస్ రెండు మార్లు ఎమ్మెల్యేగా, ప్రభుత్వ విప్‌గా, వీఎమ్మార్డీయే చైర్ పర్సన్ గా పనిచేసి మంచి పేరు తెచ్చుకున్నారు. కరోనా మహమ్మారి పుణ్యమాని ఈ ఏడాది అక్టోబర్ లో ద్రోణంరాజు శ్రీనివాస్ దివంగతులయ్యారు. ఆయన కుమారుడు శ్రీవాత్సవ మీద ఇపుడు తండ్రి తాత రాజకీయ వారసత్వాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత పడింది. ద్రోణంరాజు శ్రీనివాస్ అకాల మృతితో సాఫ్ట్ వేర్ వృత్తిని సైతం వదులుకు వచ్చిన శ్రీ వాత్సవను తండ్రి సంస్మరణ సభలోనే రాజకీయాల్లోకి రావాలంటూ ఎంపీ విజయసాయిరెడ్డి సభాముఖంగా ఆహ్వానించారు. దానికి సుముఖత వ్యక్తం చేసిన ద్రోణంరాజు శ్రీవాత్సవ గత కొన్ని రోజులుగా వైసీపీ సభల్లో సమావేశాల్లో కనిపిస్తూ వస్తున్నారు. ఇక ప్రతీ ఏటా దివంగత ద్రోణంరాజు సత్యనారాయణ జయంతిని విశాఖలో ఘనంగా ద్రోణంరాజు శ్రీనివాస్ నిర్వహించేవారు. ఈ ఏడాది ఆ బాధ్యతలను మనవడిగా శ్రీ వాత్సవ నెత్తిన వేసుకోవడమే కాదు సక్సెస్ ఫుల్ గా జరిపించి తన సత్తాను చాటుకున్నారు. వైసీపీకి చెందిన అతిరథ మహారథులంతా ఈ సభకు హాజరు కావడం వెనక ద్రోణంరాజు శ్రీ వాత్సవ కృషి చాలానే ఉంది. విజయసాయిరెడ్డి మంత్రి అవంతి శ్రీనివాస్ సహా ప్రముఖులంతా శ్రీ వాత్సవ్ నాయకత్వ లక్షణాలను కొనియాడారు. రాజకీయాల్లో రాణిస్తాడంటూ దీవించేశారు.విశాఖ దక్షిణ నియోజకవర్గంలో ద్రోణంరాజు శ్రీనివాస్ రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి మంచి పేరు తెచ్చుకున్నారు. ఆయన తనకున్న మంచి తనాన్నే పెట్టుబడిగా పెట్టి కడదాకా ప్రజలకు సేవలు అందించారు. ఇపుడు ఆ పెట్టుబడినే అందుకుని ద్రోణంరాజు శ్రీ వాత్సవ్ కూడా ముందుకు సాగనున్నాడు. విశాఖ సౌత్‌లో సిట్టింగ్ టీడీపీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ దూసుకుపోతున్నారు. ఆయన వైసీపీకి మద్దతు ప్రకటించి మరీ జై జగన్ అంటూ దూకుడుగా కార్యక్రమాలు చేపడుతున్నారు. బలమైన మత్స్యకార వర్గానికి చెందిన వాసుపల్లికి తోడు అదే సామాజికవర్గానికి చెందిన కోలా గురువులు అక్కడ పార్టీ ఇంచార్జిగా ఉన్నారు. ఈ ఇద్దరినీ దాటుకుని ఇపుడు ద్రోణంరాజు వారసుడు ముందుకు సాగాలి. జనం మద్దతు సాధిస్తే తప్పకుండా జగన్ టికెట్ ఇస్తారు. కానీ అది అంత ఈజీనా అన్నదే తేలాల్సి ఉంది. ఏది ఏమైనా తండ్రికి తగిన వారసుడిగా ఎదిగేందుకు ద్రోణంరాజు శ్రీ వాత్సవ్ చేస్తున్న కృషికి మాత్రం వైసీపీలో పెద్దల నుంచి మద్దతు దక్కుతోంది.

# గోవా బీచ్‌లో చై- సామ్ రచ్చకు రెడీ



న్యూ ఇయర్ వేడుకలకు సెలబ్రిటీలు రెడీ అయిపోతున్నారు. డిసెంబర్ 31 మిడ్ నైట్ ట్రీట్‌కి మెట్రో పాలిటన్ సిటీస్‌లో స్టార్ హోటళ్లు ముస్తాబయ్యే పరిస్థితి ఇదివరకటిలా లేదు. షరతులతో కూడిన అనుమతిని ప్రభుత్వాలు ఇచ్చేందుకు సిద్ధంగా లేవు ఈసారి. ఇక విదేశాల్లో సెలబ్రేషన్స్‌కు పలువురు సెలబ్రిటీలు ఇప్పటికే ఫ్లైట్ ఎక్కేయాలనుకుంటే న్యూ స్ట్రెయిన్ వైరస్ చెక్ పెట్టింది. ఇప్పటికే పలువురు సెలబ్రిటీలు గోవా బీచ్ సెలబ్రేషన్‌తో సరిపెట్టుకోవాలని ప్లాన్ చేసుకున్నారు. తాజాగా టాలీవుడ్ ఆదర్శ జంట నాగచైతన్య-సమంత కూడా విదేశాలు వెళ్లకుండా.. ఈసారి కూడా గోవాలోనే చిటౌట్ ప్లాన్ చేసారు. ఇప్పటికే గోవా తీరం చేరుకునేందుకు హైదరాబాద్ విమానాశ్రయానికి వెళ్లారు. అందుకు సంబంధించిన ఫోటోలు అంతర్జాలంలో వైరల్ గా మారాయి. ఈ జంటతో పాటు స్నేహితుల బ్యాచ్ కూడా ఈసారి సెలబ్రేషన్స్ లో ఛీర్ చేస్తున్నారా లేదా అన్నది చూడాలి. ఇటీవల టాలీవుడ్ ప్రముఖులు స్నేహితులు కుటుంబ సభ్యుల మధ్య క్రిస్మస్ వేడుకల్ని ఘనంగా జరుపుకున్నారు. ఇంతలోనే ఇలా దంపతులు ఇద్దరు గోవా ఫ్లైట్ ఎక్కేందుకు వెళుతున్న ఫోటోలు లీకవ్వడంతో అసలు విషయం బయటకు వచ్చింది. డిసెంబర్ 30 .. డిసెంబర్ 31 .. జనవరి 1 తేదీలను గోవాలో సెలబ్రేట్ చేసుకుని అదే వారంలో మళ్లీ హైదరాబాద్ లో ల్యాండయ్యే వీలుందట. వెంకీమామతో నాగచైతన్య మంచి సక్సెస్ అందుకుని కమ్ముల లవ్ స్టోరీలో నటిస్తున్నాడు. వచ్చే ఏడాది చై పలు ప్రాజెక్టులతో బిజీగా ఉండనున్నాడు. అలాగే సమంత ఓ బేబి లాంటి లేడీ ఓరియేంటెడ్ చిత్రంతో భారీ విజయాన్ని అందుకున్నా జాను ఫ్లాపై నిరాశపరిచింది. ప్రస్తుతం ఫ్యామిలీ మ్యాన్ -2 వెబ్ సిరీస్ పైనే హోప్స్. అలానే సామ్ జామ్ ఆహాలో రంజింపజేస్తోంది.

# సలార్‌లో ప్రభాస్ లుక్..




యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ ప్రస్తుతం రాధేశ్యామ్ సినిమా షూటింగ్ తో బిజీగా ఉన్నాడు. ఇదే సమయంలో సలార్ సినిమా కోసం కండలు పెంచే పనిలో కూడా ఉన్నాడు అంటూ ఇండస్ట్రీ వర్గాల ద్వారా సమాచారం అందుతోంది. సలార్ సినిమా షూటింగ్‌ను వచ్చే నెల నుండి మొదలు పెట్టబోతున్నారు. అందుకోసం చిత్ర యూనిట్ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. మరో వైపు ప్రభాస్ లుక్ పై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ప్రస్తుతం సినిమా కోసం నటీనటుల ఎంపిక జరుగుతున్నట్లుగా వార్తలు వస్తున్నాయి. ప్రభాస్ రాధేశ్యామ్ లో కనిపించిన దాని కంటే అయిదు నుండి ఏడు కేజీల బరువు ఎక్కువగా కనిపించబోతున్నట్లుగా తెలుస్తోంది. సలార్ సినిమాలో ప్రభాస్ లుక్ చాలా వైవిధ్యభరితంగా ఉంటుందని అంటున్నారు. ప్రభాస్ గత సినిమా లతో పోల్చితే ఈ సినిమాలో కాస్త లుక్ ను మార్చబోతున్నాడు. సలార్ సినిమాలో ప్రభాస్ మీసాలతో కనిపించబోతున్నాడు. రెగ్యులర్ కంటే కాస్త ఎక్కువ మీసాలతో ప్రభాస్ సలార్ సినిమాలో కనిపిస్తాడని యూనిట్ సభ్యుల ద్వారా తెలుస్తోంది. వచ్చే ఏడాది ఈ సినిమా షూటింగ్‌ను పూర్తి చేసి వచ్చే ఏడాది చివర్లోనే సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకు వస్తానంటూ ప్రశాంత్ నీల్ అంటున్నాడు. కేజీఎఫ్ 2 సినిమా తర్వాత ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా అవ్వడంతో సలార్ పై దేశ వ్యాప్తంగా అంచనాలు భారీగా ఉన్నాయి

# ఆ మచ్చల్ని కాదు నివేద సహజ అందాన్ని గట్స్ ని చూడాలి



బాహ్య సౌందర్యం.. అంతఃసౌందర్యం.. దేనికి ఎక్కువ ఆకర్షితులవుతారు? అంటే తొలిగా బాహ్య సౌందర్యాన్ని ఇష్టపడతారు. తర్వాత అంతఃసౌందర్యాన్ని మంచి మనసును అంతకుమించి ఇష్టపడేవారే ఎక్కువవుతారు. నిజానికి ఇంతకు ముందు పలువురు అందాల కథానాయికలు తమ సహజ అందాన్ని ఆవిష్కరిస్తూ లోపాల్ని కూడా బహిర్గతం చేసేందుకు ఇష్టపడడంతో ఆ ఫోటోలు అంతర్జాలంలో వాడి వేడి చర్చకు తావిచ్చాయి. అందాల చందమామగా పాపులరైన కాజల్ ముఖారవిందంపై మచ్చలు ఉన్న ఫోటో అప్పట్లో సంచలనమే సృష్టించింది. అయితే తన అంతః సౌందర్యం చూపించేందుకు ప్రతిదీ బహిర్గతం చేస్తానని నేచురల్ అందం చూడమని అభిమానుల్ని కాజల్ కోరింది. ఇప్పుడు అందాల నివేతా థామస్ స్కిన్ స్పాట్స్ (మచ్చలు) అంతే హాట్ టాపిక్ గా మారాయి. తాజాగా సోషల్ మీడియాలో పంచుకున్న ఫోటో అభిమానుల్లో వైరల్ గా మారింది. నివేద చేతులపై పింక్-ఎరుపు మచ్చలతో లోపం బహిర్గతమైంది. వాక్సింగ్ ఇతర అందం పెంపొందించే ప్రక్రియల వల్ల ఆ మచ్చలు ఏర్పడ్డాయా? అని ఆమెను అడుగుతూ చాలా మంది ఆమె మచ్చలపై వ్యాఖ్యానించడం ప్రారంభించారు. కానీ మనుషులకు అలాంటి మచ్చలు ఉండటం సర్వ సాధారణమని తనకు మద్దతునిచ్చే వారి సంఖ్యా అపరిమితంగా ఉంది. చాలా మంది మహిళలు నివేద తరహాలోనే మచ్చలను కలిగి ఉన్నామని అంగీకరిస్తూ...సామాన్యుల కంటే నివేద ఏమీ భిన్నంగా లేదని సంతోషించారు. వాస్తవానికి కెరెటిన్ అనే వర్ణద్రవ్యం వల్ల చర్మంపై మచ్చలు ఏర్పడుతాయి. తాను ఇలా కెరాటోసిస్‌తో కాఫీ షాప్‌లో ప్రత్యక్షమై బహిరంగంగా తన చేతులను ప్రదర్శించి డేర్ చేయడం అందరినీ ఆకట్టుకుంది. తాను ప్రతిదీ ఓపెన్ గా ఉండేందుకు ఇలా చేశానని కూడా నివేతా థామస్ ఇప్పటికే ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్ లో పేర్కొన్నారు. కాబట్టి ఇది అసాధారణమైన పరిస్థితి కాదు. ఈ రోజుల్లో పిక్చర్-పర్ఫెక్ట్ బ్యూటీ ప్రాసెస్డ్ మచ్చలేని చర్మ సౌందర్యం కంటే అభిమాన జనం సహజ సౌందర్యానికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. అందువల్ల సోషల్ మీడియా వినియోగదారులలో చాలామంది ఆమె చర్మ లోపాలతోనూ అద్భుతంగా కనిపిస్తున్నారని ప్రశంసిస్తున్నారు. అన్నట్టు నివేద థామస్ మలయాళీ అమ్మాయే అయినా తనతో ఒకసారి తెలుగులో మాట్లాడితే ఇంత స్వీట్ గా తెలుగమ్మాయిల్ని మించి గొప్పగా తెలుగు మాట్లాడుతున్నారని అంగీకరించి తీరాల్సిందే. టాలీవుడ్ మీడియా ఇంటర్వ్యూల్లో ఎంతో చక్కని తెలుగు మాట్లాడుతూ ప్రతిసారీ ఆశ్చర్యపరచడం నివేదకే తెలిసిన విద్య.




# బ్రాండ్ మాటేమోగానీ ప్రగ్య భంగిమపైనే అందరి దృష్టి!

దిశా పటానీ తర్వాత సోషల్ మీడియా క్వీన్ గా ముంబై బ్యూటీ ప్రగ్య జైశ్వాల్ పేరు అమాంతం పాపులరైంది. దిశా మొదలు పెట్టిన సీకే (కెల్విన్ క్లెయిన్) బ్రాండ్ ప్రమోషన్ తరహాలోనే ఆ తర్వాత ప్రగ్య కూడా ఇన్ వోర్ కి ప్రచారం మొదలు పెట్టి వేడెక్కించే ఫోటోలు.. వీడియో ట్రీట్ తో అందరి దృష్టిని ఆకర్షించింది. ఇన్ స్టాలో అసాధారణ ఫాలోవర్స్ ని సంపాదించుకుంది ఈ బ్యూటీ. తాజాగా ఈ భామ ఖాతాలోకి ప్రఖ్యాత డీజిల్ బ్రాండ్ చేరింది. దీనికోసం భారీ కాంట్రాక్ట్ కుదుర్చుకుందని లక్షల్లో రెవెన్యూ ఆర్జిస్తోందని తెలుస్తోంది. డీజిల్ బ్రాండ్ ఇన్ వోర్ ధరించి బ్లూ జీన్స్ షర్ట్ ధరించింది. అలాగే బాటమ్ లో బ్లూ జీన్స్ షార్ట్ తో బటన్ లెస్ ఫోజులో చెలరేగిపోయింది. నీలిరంగు డెనిమ్ జాకెట్.. చిట్టి పొట్టి డెనిమ్ షార్ట్ లు ఈ భామకు కొత్తేమీ కాదు కానీ.. డీజిల్ బ్రాండ్ డీప్ బ్లూ స్పోర్ట్స్ బ్రా ప్రగ్య టోన్డ్ బాడీకి ప్రత్యేక ఆకర్షణగా మారింది. అలా పాల మీగడ నాభి అందాల్ని ఎలివేట్ చేస్తూనే.. ఒంపుసొంపుల్ని ఎరవేసిందిలా. ప్రగ్య హాటెస్ట్ పోజ్ అమాంతం బోయ్స్ లో వేడిని పెంచింది. అలా గాల్లో చేతులు మెలితిప్పి కుర్రకారు గుండెల్ని మెలి తిప్పేసింది ప్రగ్య. మండే బ్లూస్ నా స్టైల్లో అంటూ క్యాప్షన్ కూడా ఇచ్చింది. ప్రస్తుతం ఈ ఫోటో వైరల్ గా మారింది. మరోవైపు మంచు విష్ణు సరసన శ్రీనువైట్ల దర్శకత్వంలో ఢీ అండ్ ఢీలో ప్రగ్యకు ఛాన్స్ దక్కనుందన్న ప్రచారం సాగుతోంది. ఒకవేళ ఇదే నిజమైతే తన వెయిటింగ్ ఫోటోషూట్ల కష్టం ఇన్నాళ్లకు ఫలించినట్టే.

# ఫ్యామిలీమ్యాన్ దర్శకద్వయంతో రాశీ ఖన్నా బిగ్ డీల్



అందాల రాశీ ఖన్నా బాలీవుడ్ కి జంప్ అయిపోతోందా? అందుకు సీరియస్ ప్రయత్నాల్లో ఉందా? అంటే అవుననే సమాచారం అందుతోంది. ఈ భామకు ఇటీవల తెలుగులో అవకాశాలు తగ్గాయి. ఆ క్రమంలోనే తమిళంలో సెటిలయ్యే ప్రయత్నం చేసింది. అక్కడ వరసగా సినిమాల్లో నటిస్తోంది. అయితే దీపం ఉండగానే చక్కదిద్దుకునే పనిలో భాగంగా అటు హిందీ చిత్రసీమపైనా దృష్టి సారించిందట. నిజానికి రాశీ బాలీవుడ్ లోనే కెరీర్ ప్రారంభించి సౌత్ కి వచ్చింది. 2013 హిట్ చిత్రం మద్రాస్ కేఫ్ (జాన్ భాయ్)తో ముంబై పరిశ్రమలో తెరంగేట్రం చేసిన రాశీ అవసరాలతో టచ్ లోకి రావడంతో టాలీవుడ్ ఎంట్రీ ఇవ్వగలిగింది. ఇక్కడ వరుసగా సినిమాల్లో నటించింది. అయితే ఇటీవల కొన్ని ఫ్లాపులు ఇబ్బందికరంగా మారాయి. ఇక్కడ అడపాదడపా అవకాశాలు దక్కుతున్నా కెరీర్ పరంగా జోష్ ఏమంత లేకపోవడంతో చాలా తెలివైన నిర్ణయాలు తీసుకుంటోందిట. తాజా సమాచారం ప్రకారం.. రాశీ ఖన్నా దర్శకద్వయం రాజ్ అండ్ డీకే తెరకెక్కించే వెబ్ సిరీస్ కి సంతకం చేసినట్లు సమాచారం. ఇందులో షాహిద్ కపూర్ కూడా ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. రాజ్ అండ్ డీకే 'ది ఫ్యామిలీ మ్యాన్' సిరీస్ అన్ని భాషల్లోనూ విజయవంతం కావడంతో సూపర్ పాపులారిటీ పొందారు. ప్రస్తుతం రెండవ సీజన్ విడుదలకు సిద్ధం చేస్తున్నారు. తాజా వెబ్ సిరీస్ సక్సెసైతే ఇకపై మరిన్ని బాలీవుడ్ ఆఫర్లతో ముంబై పరిశ్రమలోనే అందాల రాశీ సెటిలయ్యే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. రకుల్ ప్రీత్ తర్వాత రష్మిక మందన కూడా బాలీవుడ్ లో అడుగు పెట్టేస్తోంది. ఆ కోవలోనే ఎందరో సౌత్ భామల్లానే నేటితరం భామల్లో రాశీ ఖన్నా బాలీవుడ్ లో పెద్ద స్టార్ డమ్ అందుకునే ప్రయత్నం చేస్తుందనే భావిస్తున్నారు.

Printed,Published & Owned by: Sajja Dhananjaya Sarath, Printed at Unyted Publications from H.no.# 5+-61-3,Rajendra Nagar,Seethampeta,Visakhapatnam-16,Published at H.No. 5+-61-3,Rajendra Nagar,Seetham peta, Visakha patnam-16, Andhrapradesh,India. Editor: Sajja Dhananjaya Sarath. RNI:APTEL/2008/25531,Permitted for posting under concession rates of postage, Postal Registration No. VJ/189/2017-19,Email.editor.prajapalana@gmail.com